ఆంధ్రజ్యోతి



కిలో పొగాకు రూ.232

కలిగిరి, ఏప్రిల్ 10: కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి బుధవారం రైతులు 589 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11కంపెనీల ప్రతినిధులు పాల్గొని 551 బేళ్లు కొనుగోలు చేశారు. నో బిడ్-22, సీఆర్-12, జంపింగ్ లాట్స్-4 కారణాలతో 38 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.232, కనిష్ఠ ధర రూ.220, సగ టు ధర రూ.229.58గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.



ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం కనిష్ఠం	36.1 27.6	35.0 26.0	38.0 26.0	38.0 24.0	35.0 26.0

ఎన్నికల పరిశీలకుల నియామకం

● నెల్లూరు సిటీ, రూరల్‌కు నితిన్ సింగ్

నెల్లూరు (హరనాథపురం) : సార్వత్రిక ఎన్నికల కోసం జిల్లాకు ఎన్నికల పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది. నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు, ఆత్మకూరు నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా నితిన్ సింగ్ బదారియాను నియమించారు. కందుకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు రామ్‌కుమార్ గౌతమ్, సర్వేపల్లికి కరీగౌడ నియమితులయ్యారు. ఆత్మకూరు, కోవూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల పోలీసు పరిశీలకుడిగా అశోక్ దూదే, సర్వేపల్లికి అరవింద సాల్వే నియమితులయ్యారు. ఏప్రిల్ 25 నుంచి మే 13 వరకు పోలీసు పరిశీలకులు, ఏప్రిల్ 25 నుంచి జూన్ 4 వరకు సాధారణ పరిశీలకులు జిల్లాలో విధుల్లో ఉంటారు.

● 18న ఎన్నికల గజిట్ నోటిఫికేషన్

ఈ నెల 18న ఎన్నికల గజిట్ నోటిఫికేషన్ ఇస్తామని కలెక్టర్ హరినారాయణన్ చెప్పారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 12న ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో మొదటి విడత ఎలక్ర్టానిక్ ఓటింగ్ మిషన్ల ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఈవీఎం గోదాములనె తెరుస్తామని, ఓటర్ల నమోదుకు 14 వరకు దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 7932 దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 20,48,252 మంది ఓటర్లు ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల వారు పూర్తిస్థాయిలో పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, తెలుగుదేశం నుంచి రసూల్, బీఎస్పీ నుంచి శ్రీరామ్, ఆమ్ ఆద్మీ నుంచి శివరామరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్




బాణసంచా కాల్చుతున్న ముస్లిం యువత

అటకెక్కిన మగ్గం!

చేనేతను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

గత ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాల రద్దు

అబ్బురపరిచే వస్త్రకళా నైపుణ్యం చేనేతలది. అలాంటి నేతన్న సమస్యలతో పోరాటం చేస్తూ అతికష్టంగా మనుగడ సాగిస్తున్నాడు. రెక్కలు విరిగేలా.. కీళ్లు అరిగేలా కాళ్లతో రోజంతా పావు చెక్కలు తొక్కి గొడ్డు చాకిరీ చేస్తున్నా ఐదు వేళ్లు నోటిలోకి వెళ్లే పరిస్థితి లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికులు కోలుకోలేనంతగా దెబ్బతిన్నారు. టీడీపీ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు రద్దు చేసి ఒకరిద్దరికి పదో.. పరకో.. చిల్లర రాల్చిన ప్రభుత్వం వారి సమస్యలను పూర్తిగా పక్కన పెట్టింది. ఫలితంగా చేనేత వృత్తి ప్రశ్నార్థకంగా మారింది.



కూలి గిట్టుబాటు కాక మూలకు చేరిన మగ్గం



అటక మీదకు చేరిన మగ్గం డాబీ

సంగం, ఏప్రిల్ 10 : జిల్లాలో వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమపై అత్యధికంగా ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో చేనేత మగ్గాలు 6,850 ఉన్నాయి. అనధికారికంగా (నేతన్న నేస్తం రానివారు) మరో రెండు వేలు ఉంటాయి. వాస్తవానికి జిల్లాలో చేనేత కుటుంబాలు 25 వేల వరకు ఉన్నాయి. వీరిలో కొంత మంది కులవృత్తి గిట్టుబాటు కాక మగ్గం మూలన పడేసి తాపీ, వంట పని, ఉపాధి హామి వంటి ఇతర పనులకు వెళ్తున్నారు. వీరు కాకుండా మరో 7వేల కుటుంబాలు చేనేత ఉప కులాల వారు ఉన్నారు. సంగం, వింజమూరు, కోవూరు, పాటూరు, గుమ్మళ్లదిబ్బ, చెన్నూరు, ఆత్మకూరు, ఏఎస్‌పేట, కావలియడవల్లి, కొత్తపేట, నారాయణరెడ్డిపేట, బుచ్చి తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. స్వయం పోషకంగా ఉన్న ఈ రంగానికి ప్రభుత్వాలు కొద్దిపాటి ఊతం ఇస్తే సరిపోతుంది. వైసీపీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వాలు ఇచ్చిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలను రద్దు చేయడంతో ఆ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

ముంచిన కరోనా

2020లో కరోనా నివారణకు చేపట్టిన లాక్‌డౌన్ చేనేత కార్మికుల వృత్తికి శాపంగా పరిణమించింది. ఆ రోజు నుంచి ఇప్పటి వరకు చేనేత పరిశ్రమ కోలుకోలేదు. లాక్‌డౌన్ కారణంగా విదేశాల నుంచి రావాలసిన జరీ నిలిచిపోయింది. దీంతో డిమాండ్ పెరిగి ధరలు రెట్టింపయ్యాయి. ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగలేదు. ఉత్పత్తులు పెరిగి మార్కెట్ డిమాండ్ తగ్గింది. వస్త్రానికి ధర లు పతనమై గిట్టుబాటు తగ్గిపోయింది.

జీఎస్టీతో కుదేలు

జీఎస్టీతో చేనేత పరిశ్రమ కుదేలయ్యింది. 2020 నుంచి చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ విధించడంతో ఉత్పత్తులపై ధరలు పెరిగాయి. దీంతో డిమాండ్ తగ్గి మార్కెట్ పడిపోయింది. దీనిప్రభావం ఎగుమతులపైనా పడింది. అంతేగాక హ్యాండ్‌లూమ్‌పై తయారయ్యే 18 రకాల వస్త్ర డిజైన్లను మరమగ్గాలపై నేయకుడదని నిషేదం ఉంది. అయినా పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో నిషేధిత డిజైన్లు మరమగ్గాలపై కొందరు తయారు చేస్తున్నారు. మరమగ్గాలపై తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పత్తి తయారు కావడంతో ఆ ఉత్పత్తులను మార్కెట్‌లో తక్కువ ధరకే విక్రయించవచ్చు. ఆ ధరకు హ్యాండ్‌లూమ్‌పై తయారయ్యే ఉత్పత్తులు ఇస్తే గిట్టుబాటు కాదు. హ్యాండ్‌లూమ్‌పై తయారయ్యే వస్త్రం నాణ్యత, మన్నిక కలిగినదైనా మార్కెట్‌లో మరమగ్గాలపై ఉత్పత్తులు తక్కువ ధరకు లభ్యమవుతుండటంతో హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులకు డిమాండ్ తగ్గి ధరలు పతనమై గిట్టుబాటు కావడంలేదు. దీంతో నేతన్న మనుగడ సాగించలేకపోతున్నాడు.



ఉపాధి హామి పనులకు వెళ్తున్న నేత కార్మికులు

టీడీపీ హయాంలో ఊరట

టీడీపీ హయాంలో చేనేత సంరక్షణకు నూలు రంగంపై సబ్సిడీ ఇచ్చింది. చేనేత సహాయనిధి, పొదుపునిధి, రంగుల కోసం, ఆధునిక పనిముట్ల కింద రాయితీ కింద రూ. కోట్లు ఖర్చు చేసింది. 50 ఏళ్లు దాటిన వారికి చేనేత పింఛను కింద రూ. 2వేలు అందచేశారు. చేనేత పరిశ్రమను రక్షించడానికే కాకుండా కార్మికులకు వ్యక్తిగతంగా కూడా కొంత ఊరటనిచ్చేది. అందులో భాగంగా 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు జీవో విడుదల చేసింది. అయితే, వైసీపీ వచ్చిన తరువాత ఆ జీవో ఊసే లేదు.

● ఐసీఐసీఐ లంబార్డ్ ఇన్సూరెన్స్ ఆరోగ్య పథకం పూర్తిగా నిలిపి వేశారు. ఈ పథకంలో చేనేత కార్మికుడు రూ.100 చెల్లిస్తే ఏడాదిపాటు రూ. 15వేలు ఆరోగ్య బీమా వర్తించేది. చేనేత కార్మికులకు వృత్తిపరంగా రంగుల వల్ల ఊపిరితిత్తులు, కీళ్ల నొప్పులు, కంటిచూపు లోపం, టీబీ వంటి వ్యాధుల పాలవుతుంటారు. ఇలాంటి సందర్భంలో చేనేత కార్మిక కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం పాలై ఏ వైద్యశాలలోనైనా వైద్యం చేయించుకుని బిల్లు పెట్టితే రూ. 15వేలు ఇచ్చేవారు.

● బునకర్ బీమా యోజన పథకంలో రూ.80 లకే ఇన్సూరెన్సు కల్పించేవారు. ఈ పథకంలో కుటుంబ యజమాని సాధారణ మరణం చెందితే రూ.60 వేలు, ప్రమాదవశాత్తు అయితే రూ.1.5 లక్షలు ఇచ్చేవారు. ఈ పథకాన్ని కూడా వైసీపీ రద్దు చేసింది.

● ఎన్‌హెచ్‌డీసీ (నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ స్కీమ్) పథకంలో చేనేత కార్మికుడికి నూలు కొనుగోలుకు 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఇప్పుడీ పథకం లేదు.

● ఎన్‌సీడీసీ (నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఈ పథకంలో కార్మికులకు ముద్ర యోజన రుణాల కింద రూ.50 వేల బ్యాంకు రుణాలు ఇచ్చే పథకం నిలిపేశారు.

● గతంలో మగ్గం నేసే కార్మికులకు వర్క్‌షెడ్డు కోసం రూ.75 వేల ఇచ్చేవారు. దాన్ని పూర్తిగా నిలిపివేశారు.

టీడీపీ హయాంలో అమలైన ఈ పథకాలన్నిటినీ వైసీపీ అధికారంలోకి రాగానే రద్దుచేసింది. దీంతో చేనేత కార్మికులకు గడ్డిపూస సాయం కూడా వారికి లభించలేదు. చేనేత వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉంది. నైపుణ్యం కలిగిన కార్మికులూ ఉన్నారు. అయితే, ప్రభుత్వ ఆదరణే కరువయ్యింది. కార్మికుల ఉపాధి విషయాన్ని గాలికొదిలి వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో అరకొర కేటాయిస్తూ వచ్చింది. అది చేనేత జౌళి శాఖ ఉద్యోగుల జీతాలు, నేతన్న నేస్తానికి కూడా చాలలేదు.

నేతన్న నేస్తంతో సరి

రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తం పథకంతో సరిపెట్టింది. మగ్గం ఉన్నవారికి ఏడాదికి రూ.24 వేలు మాత్రమే ఇస్తోంది. ఇందులోను అనేక తిరకాసులు పెట్టి నేతన్న నేస్తం ఎగనామం పెడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుభరోసా, 300 యూనిట్లపైన కరెంటు బిల్లు, ఇంట్లో ఎవరైనా చదువుకుని చిన్న ఉద్యోగం వచ్చినా వారి తల్లిదండ్రులకు నేస్తం ఇవ్వడం లేదు. అంతేకాదు 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి పించను ఇవ్వాల్సి ఉండగా రకరకాల కారణలతో ఎగనామం పెడుతున్నారు.

వీరికి మొండిచెయ్యి

చేనేత రంగంపై ఆధారపడి 18 ఉప కులాలు అచ్చుల అతికేవారు, కండెలు చుట్టేవారు, పొదుగులు పట్టేవారు. నూలు వడికేవారు ఉన్నారు. వీరితోపాటు చేనేత అనుబంధంగా పన్నెలు కట్టేవారు, మగ్గాలు తయారు చేసేవారు అచ్చులు కట్టేవారు, నూలుకు రంగులు అద్దేవారు తదితర 12 ఉప వృత్తులవారు ఉన్నారు. వీరందరికి ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది. ప్రభుత్వం అందచేసే నేతన్న నేస్తం పథకానికి అనర్హులను చేసింది. దీంతో వీరంతా వీధిన పడ్డారు.

చేనేత సమస్యలకు శాశ్వత పరిష్కారాలివే..

● ప్రతి నేతన్నకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్త్ర డిజైన్ల తయారీపై నిరంతరం శిక్షణ కల్పించడం, ఆధునిక సాంకేతిక పనిముట్లు, వర్క్ షెడ్డు నిర్మాణానికి ప్రత్యేక ప్యాకేజి కింద రూ. 2.5 లక్షల ఆర్థిక సాయం చేయాలి.

● చేనేత ఉత్పత్తులకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ మార్కెట్ వసతి కల్పించడం తోపాటు పెట్టుబడి కింద ప్రతి చేనేత కార్మికుడికి వడ్డీలేని రుణం రూ.2లక్షలు అందచేయాలి.

● చేనేత ముడి సరుకుల (నూలు, జరీ తదతర) దిగుమతులు, ఉత్పత్తుల ఎగుమతు లపై విధించిన 5 శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించాలి.

● ముడి నూలు కొనుగోలు, అద్దకం రంగులపై 10 శాతం రాయితీ ఇవ్వాలి.

● చేనేత రిజర్వేషన్ చట్టం కింద కేటాయించిన 18 రకాల ఉత్పత్తులను పవర్‌లూమ్‌లపై ఉత్పత్తి చేయకుండా చర్యలు చేపట్టాలి.

● ప్రతి చేనేతకు టుంబానికి 300 యూ నిట్ల ఉచిత కరంటు సరఫరా చేయాలి.

● ప్రతి జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో చేనేత ఉత్పత్తుల విక్రయాలకు రైతు బజార్లు మాదిరి చేనేత బజారు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఈ కేంద్రాల్లో నేతన్నలే వస్త్ర ఉత్ప త్తులను స్వ యంగా విక్రయించి, దళారుల వ్యవస్థ లేకుండా నేతన్నే లబ్ధి పొందే అవకాశం కల్పించాలని చేనేత సం ఘాలు, నా యకులు డిమాండ్ చేస్తు న్నారు.



కుటుంబ పోషణ భారమైంది

ప్రస్తుతం ముడిసరుకు ధరలు పెరిగిపోయాయి. దీంతో మాస్టర్ వీవర్స్ ముడి సరుకులు ఇవ్వటంలేదు. చేసేదిలేక ఉన్న మగ్గాన్ని మూలన పెట్టి ఉపాధి హామి పనులకు వెళ్తున్నాం. టీడీపీ హయాంలో వడ్డీలేని రుణాలు, ఆదరణ కింద పనిముట్లు, ముడిసరుకుపై సబ్సిడీ ఇచ్చేవారు. ప్రస్తుతం సంక్షేమ పథకాలు ఏమీ ఇవ్వడంలేదు. నేతన్న నేస్తం సొంత మగ్గం ఉంటేనే ఇస్తున్నారు. దీంతో కుటుంబ పోషణ భారమై కూలి పనులకు పోతున్నా.

- శీనయ్య, చేనేత కార్మికుడు, సంగం



వైసీపీ పాలనలో ఒరిగిందేమిలేదు

వైసీపీ ఐదేళ్ల పాలనలో చేనేతలకు ఒరిగిందేమీ లేదు. పైగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. నేతన్న నేస్తం కొందరికే ఇస్తున్నారు. కార్మికులకు పని కల్పిస్తే నేతన్న నేస్తం లేకపోయినా బతుకుతాం. పనిలేని కారణంగా చాలామంది వేరే వృత్తివైపు వెళ్తున్నారు.

- పెంచలమ్మ, నేత కార్మికురాలు, సంగం

నేడు రంజాన్

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 10 : ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్)ను గురువారం జిల్లా వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఈ పండుగ ప్రత్యేక ప్రార్థనల కోసం అన్ని మసీదులు, ఈద్గాలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మసీదులను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు కొనుగోళ్లతో బజార్లు కిటకిటలాడు తున్నాయి. రంజాన్ మాసమంతా ఉపవాస దీక్ష చేసిన ముస్లింలు అందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకునే రోజే ఈద్ ఉల్ ఫితర్ పండుగ. ఈ పండుగ సందర్భంగా మసీదులు, ఈద్గాలలో సామూహిక ప్రార్థనలు, దువా చేస్తారు. ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రాంతాలను బట్టి కార్యక్రమాలు జరుగుతాయి. ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా అన్ని మసీదులు, ఈద్గాల వద్ద పారిశుద్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించింది.

నెలవంక దర్శనంతో సంబరాలు

రంజాన్ మాసంలో బుధవారం సాయంత్రం ఇఫ్తార్ ప్రార్థనలతో ఉపవాస దీక్షలు ముగిశాయి. గురువారం జరుపుకునే ఈద్ ఉల్ ఫితర్ పండుగను ఆహ్వానిస్తూ నెల్లూరు నగరంలోని పలు కూడళ్లలో పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి ముస్లింలు హర్షాన్ని వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, మాజీ మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు వేర్వేరు ప్రకటనల్లో పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



బారాషాహీద్ దర్గాలో ఏర్పాట్లు

నిర్మాణాలు ఆపకుంటే తొలగిస్తాం!

● కావలిలో ఆక్రమణదారులకు నోటీసులు

కావలి, ఏప్రిల్ 10 : మందాటి చెరువులోతట్టు ప్రాంతంలోని రాళ్లగుట్టలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ దారులకు మున్సిపల్ ప్రణాళికాధికారి బాబూరావు నోటీసులు జారీ చేశారు. 'సందట్లో సడేమియాలా' అనే శీర్షికతో మందాటి చెరువులో అక్రమ నిర్మాణాలపై బుధవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మున్సిపల్ ప్రత్యేకాధికారి, కావలి ఆర్డీవో శీనానాయక్ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో ప్రణాళికాధికారి బాబూరావు తమ సిబ్బందితో అక్కడకు వెళ్లిజరుగుతున్న నిర్మాణాలను ఆపు చేయించి, ఆక్రమణదారులకు నోటీస్‌లు జారీ చేశారు. ఈ నిర్మాణాలు ఆపకుంటే పూర్తిగా కూల్చివేయాల్సి వస్తోందని హెచ్చరించారు.



భవన నిర్మాణ పనులను ఆపిస్తున్న మున్సిపల్ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ఉదయగిరి రూరల్ : పట్టణంలోని మంగళగిరి, ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు ఈవోపీఆర్డీ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అప్పుడే గొంతెండుతోంది' అనే శీర్షికన కథనం ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి కరీముల్లాతో కలిసి ఆయన కాలనీల్లో పర్యటించారు. దెబ్బతిన్న ట్యాంకు వాల్వుకు మరమ్మతు చేయించి మంచినీటి సరఫరా చేస్తామని తెలిపారు.

ముమ్మర తనిఖీలు

● నగదు, మద్యం స్వాధీనం

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 10: ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. మద్యం అక్రమ అమ్మకాలపై, పేకాట స్థావరాలపై బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. నెల్లూరులోని నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో రూ.3.50 లక్షలు, కోవూరులో రూ.8 లక్షలు, మనుబోలులో రూ.లక్ష, వెంకటాచలం సత్రంలో రూ.3.30 లక్షలు, కావలి రూరల్ స్టేషన్ పరిధిలో రూ.1,10,180 నగదును స్వాధీనం చేసుకున్నారు. మనుబోలు పరిధిలో 15 మద్యం బాటిళ్లు, ఇందుకూరుపేటలో 16, కోవూరులో 12, వింజమూరులో 11, వెంకటాచల సత్రంలో 12, సైదాపురంలో 7, ఎస్ఆర్‌పురంలో 13, ముత్తుకూరులో 12, వీవీ పాలెంలో 15, నవాబుపేటలో 15, పొదలకూరులో 10, కలిగిరిలో 10, రాపూరులో 13, కందుకూరు రూరల్ పరిధిలో 20 చొప్పున మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకోగా, సెబ్ అధికారులు 117 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. పేకాట స్థావరాలపై దాడులు చేసిన పోలీసులు పొదలకూరు పరిధిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.22,180 నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, వేదాయపాలెం స్టేషన్ పరిధిలో నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.2,200 నగదు, ముత్తుకూరులో ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.24,200 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం!

● కలిగిరి ప్రచారంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

కలిగిరి, ఏప్రిల్ 10 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం కలిగిరి, ఉదయగిరి ప్రాంతాల్లో ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్‌తో కలిసి వేమిరెడ్డి ప్రచారం నిర్వహించారు. ముందుగా కలిగిరిలోని కలిగిరమ్మ దేవాలయంలో వారు పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఇంటింటా తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు వారికి ఘనస్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఉపాధి అవకాశాలతోపాటు చిరువ్యాపారులకు రాయితీ రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని, గెలిచిన వెంటనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ మాట్లాడుతూ గ్రామాల వారీగా ప్రజా సమస్యలు తెలుసుకున్నానని, గెలిచిన వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కలిగిరి ప్రాంతంలో సాగునీటి సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, చేరెడ్డి సుబ్బారెడ్డి, నోటి శ్రీనివాసులురెడ్డి, గంగవరపు మదన్‌కుమార్, నిశ్శంకర సురేష్, జిర్రా చిన్నఅంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న వేమిరెడ్డి, కాకర్ల

అల్లుడి కోసం రైతులను బెదిరిస్తున్న కాకాణి : సోమిరెడ్డి



మాట్లాడుతున్న సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 10 : సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో భూ కుంభకోణాలు పరాకాష్టకు చేరాయని, అల్లుడి ప్రయోజనాల కోసం ఆయన రైతులను బెదిరిస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ సర్వేపల్లి నియోకవర్గ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం రైతులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జట్లకొండూరులో రూ.11.20 కోట్ల విలువైన 16 ఎకరాల భూమిని కేవలం రూ.2.20 కోట్లకే లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూమికి చెందిన వారు ఇటీవల టీడీపీలో చేరారని, వారు టీడీపీ నుంచి బయటకు రాకపోతే వారి భూములను నిషేధిత జాబితాలో పెడతామని మంత్రి బెదిరిస్తున్నారన్నారు. వెంకటాచలం మండలం రామదాసు కండ్రిగలోనూ ఆదే పరిస్థితి ఉందన్నారు. ఇళ్లపట్టాల, భూముల పట్టాల విషయంలో జూన్ 4 వరకు కొనుగోళ్లు, అగ్రిమెంట్లు చేయవద్దని ఐదుగురు తహసీల్దార్లకు ఆదేశాలివ్వాలని కలెక్టర్‌ను కోరుతున్నామన్నారు. 7వేల ఎకరకాల భూ పంపిణీ వెనుక ఉన్న గుట్టును బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

బీజేపీకి బుద్ధి చెప్పండి

● నగరంలో రమేష్‌ను గెలిపించాలి ● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 10 : మతతత్వ బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో పార్టీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్ పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీకి ఓటేస్తే అది రాష్ట్రానికి చేటని విమర్శించారు. టీడీపీ, వైసీపీ రాష్ట్రాన్ని ఉద్ధరించవని తెలియచేశారు. ఇండియా బ్లాక్ తరఫున సీపీఎం అభ్యర్థి మూలం రమేష్ గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారని, అసెంబ్లీలోనూ ప్రజల పక్షాన పోరాడతారని, అయనకు ఓటర్లు అండగా నిలవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మతోన్మాదులు అధికారాన్ని చలాయిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసే విధంగా ప్రధాని మోదీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సీపీఎం జిల్లా అధ్యక్షుడు మూలం రమేష్, మదాల వెంకటేశ్వర్లు, చంద్ర రాజగోపాల్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూటు మారిన రేషన్ బియ్యం

● కొరవడిన అధికారుల నిఘా ● గ్రామాల్లో ఏజెంట్ల ఏర్పాటు



అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

అనంతసాగరం, ఏప్రిల్ 10: పేదలకు అందించే రేషన్ బియ్యం కొందరికి కాసులు కురిపిస్తున్నాయి. కరోనా కాలం నుంచి కొందరు మాఫియాగా ఏర్పడి బియ్యం అక్రమ వ్యాపారానికి తెరలేపారు. గ్రామాల్లో ఏజెంట్లను నియమించుకుని, వారి ద్వారా రేషన్ బియ్యం కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారుల నిఘా కొరవడడంతో ఇలా జరుగుతోందని పలువురు అంటున్నారు. అనంతసాగరం మండలంలో 25 గ్రామ పంచా యతీలు ఉండగా 34 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఈ షాపుల నుంచి ఎండీఎం వాహనాల ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందచేస్తున్నారు. దిగువ, మధ్యతరగతి పేదలకు కేంద్ర ప్రభుత్వం యూనిట్‌కు ఐదు కేజీల వంతున ఇంట్లో ఎంత మంది కుటుంబ సభ్యులు ఉంటారో అంతమందికి బియ్యం అందిస్తున్నది. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు లబ్ధిదారుల నుంచి కేజీ రూ. 10 లెక్కన బియ్యం కొనుగోలు చేసి, వాటిని రహస్య గోదాములకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి రాత్రి పూట మిల్లుకు చేర్చుతున్నారు. అక్కడ బియాన్ని పాలిష్‌పెట్టి తిరిగి మార్కెట్‌కు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ లక్షలు గడిస్తున్నారు. రీసైక్లింగ్ చేసిన బియ్యాన్ని కేజీ రూ.35 నుంచి రూ.40 అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు. మండలంలోని వెంగంపల్లికి చెందిన కొందరు ఈ వ్యాపారంలో ప్రధాన సూత్ర, పాత్రదారులుగా ఉన్నారు. గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరణ కోసం వ్యాపారులు ఏజెంట్లను నియమించు కున్నారు. అధికారుల నిఘా లేకపోవడంతోనే ఇలా జరుగుతోందనే విమర్శలు ఉన్నాయి. కాగా రెండు రోజుల క్రితం పాతదేవరాయపల్లి వద్ద 1.5 టన్నుల రేషన్ బియ్యాన్ని మండల రెవెన్యూ అధికారులు పట్టుకొని వాహనం సీజ్ చేసి, కేసు కూడా నమోదు చేశారు. ఈ క్రమంలో మరింత నిఘా పెంచి రేషన్ బియ్యం దందాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థికి తీవ్రగాయాలు



విద్యుదాఘాతానికి గురైన సన్నీ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని దుర్గంపల్లిలో బుధవారం ఉదయం విద్యుదాఘాతానికి గురై ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సింగన బోయిన చంద్రబాబు, సుజాతల కుమారుడు సన్నీ ఉద యం టిఫిన్ చేస్తూ టీవీ స్విచ్చాన్ చేయగా, విద్యుత్ షాక్ కొట్టింది. ఇది గమనించిన బాలుడి చెల్లెలు శ్రీనిధి చొక్కా పట్టుకుని పక్కకు లాగింది. ఈ ప్రమాదంలో సన్నీకి ఎడమ చేతివేలు ఒకటి తెగిపోగా, మిగిలిన వేళ్లు కాలి తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులు కూలి పను లకు వెళ్లడంతో స్థానికులు సన్నీని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

సంగం, ఏప్రిల్ 10: మండలంలోని మక్తాపురం గ్రామానికి చెందిన బుజ్జిబాబు అనే యువకుడిపై బుధవారం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, అదే గ్రామానికి చెందిన ఓ బాలికకు యువకుడు మాయమాటలు చెప్పి నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి తీసుకెళ్లాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారించిన పోలీసులు రెండు రోజుల కిందట ఆ బాలిక ఆత్మకూరులోని కాశీనాయన ఆశ్రమంలో ఉండగా తీసుకువచ్చారు. ఆ యువకుడు తనకు మాయమాటలు చెప్పి ఆలయంలో పెళ్లి చేసుకుని మోసం చేశాడని తెలిపింది. కాగా ఆ యువకుడికి గతంలోనే పెళ్లి అయి ఉంది. దీంతో నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి విచారించి యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలు కిందపడి మహిళ మృతి

బిట్రగుంట, ఏప్రిల్ 10: బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో బుధవారం రాత్రి 2వ నెంబరు ప్లాట్‌ఫాంపై చెన్నైకు వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు దిగుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఓ మహిళ మృతి చెందింది. కావలి జీఆర్పీ ఎస్సై అరుణకుమారి కథనం మేరకు.. రాపూరుకు చెందిన మార్కాపురం భూదేవమ్మ (45) తన కుమారుడితో కలసి విజయవాడలో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. అయితే ఈ రైలు నెల్లూరు రైల్వే స్టేషన్లో ఆగదని తెలుసుకుని బిట్రగుంట స్టేషన్‌లో రైలు వేగం తగ్గడంతో కుమారుడు రైల్లోంచి దిగేశాడు. తరువాత దిగబోయిన భూదేవమ్మ ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందింది. డ్యూటీలో ఉన్న స్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు సంఘటన స్థలాకి రైల్వే పోలీసులు చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	163
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	284
స్కిన్‌లెస్	314
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6823
వెండి కిలో ధర	రూ. 85,200
వెండి ఒక గ్రాము	రూ. 87.20

పాతపాలెంలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

బిట్రగుంట, ఏప్రిల్ 10: బోగోలు మండలం సీఆర్ పాలెం పంచాయతీ పాతపాలెంలో ఇటీవల వైసీపీ నాయకుల దాడుల కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై బోజ్యా ఏర్పాటు చేసిన పోలీసు పికెట్ కొనసాగుతోంది. దాడిలో గాయపడిన గోవిందయ్య ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిసింది. వైసీపీలోని రెండు వర్గాల మధ్య జరుగుతున్న వివాదాల విషయంలో స్థానిక ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి. గ్రామ సర్పంచు గిరిబాబుపై అంతర్గతంగా కుట్రలు చేస్తున్నా నేతలు పట్టించుకోలేదంటే మిగిలిన గ్రామస్థాయి నాయకుల పరిస్థితి ఏమిటనే సందేహం నెలకొంది. పార్టీ నేతలకు సర్ది చెప్పకుండా ఆద్యం పోస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

సీఎం సభకు 180 ఆర్టీసీ బస్సులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్రలో భాగంగా బుధవారం పిడుగురాళ్లలో నిర్వహించిన సభకు జిల్లా నుంచి ఆర్టీసీ అధికారులు 180 బస్సులను పంపారు. దీంతో తిరుపతి, చెన్నై, కడపకు, జిల్లాలోని పలు గ్రామాలకు వెళ్లే సర్వీసులను రద్దు చేయడం, తగ్గించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. గురువారం రంజాన్ పండుగ కావడంతో, ప్రయాణికులు అధిక సంఖ్యలో బస్టాండ్లకు చేరుకున్నారు. బస్సులు లేవని తెలయడంతో ఉసూరుమన్నారు.

సోమశిలలో 8.884 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 10: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎం సీలు, కాగా బుధవారం నాటికి ప్రాజె క్టులో 8.884 టీఎంసీల నీరు నిల్వ ఉన్న ట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.

స్ట్రాంగ్‌రూం, లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

● ఎస్పీ ఆరీఫ్ హఫీజ్



ప్రియదర్శిని కళాశాలలో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 10 : ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన నెల్లూరు రూరల్లోని ప్రియదర్శిని కళాశాలను బుధవా రం ఆయన పరిశీలించారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ అక్కడ సీసీ కెమెరాలతో నిఘా వ్యవస్థను పటిష్టంగ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని లెక్కింపు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంలను ఇక్కడకు తీసుకువచ్చే వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాయు ధ దళాలతోపాటు స్పెషల్ పార్టీ, లోకల్ పోలీసులతో పహారా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ

వెంకటాచలం: ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హాఫిజ్ సూచించారు. బుధవారం వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్నారు. గ్రామాల్లో అక్రమ మద్యం, నగదు, ప్రలోభపరిచే వస్తువులను అరికట్టాలని, చెక్‌పోస్టులను పటిష్టవంతంగా నిర్వహించాలన్నారు. విద్వేషాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ అంకమరావు, ఎస్‌ఐ రాజేష్ తదితరులున్నారు.

పోలీసుస్టేషన్లు, పోలింగ్ కేంద్రాల పరిశీలన

నెల్లూరు(క్రైం): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వేదాయపాళెం, వెంకటాచలం, మనుబోలు పోలీసు స్టేష న్లను బుధవారం ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ సందర్శించారు. స్టేషన్ల పరిధులు, భౌగోళిక పరిస్థితులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామ స్థాయిలో సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తించి వెంటనే బైండోవర్ చేయాలని అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రచారాలకు ఇచ్చే అను మతుల వివరాలను స్టేషన్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికల ప్రక్రియను ఎవరైనా ఆటంకపరిచినా, ఓటర్లను ప్రలోభపెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భగం వాటిల్లితే వెంటనే ఆ ప్రదేశానికి చేరుకునే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలంటూ దిశానిర్దేశం చేశారు.

ప్రసవాలు ప్రహసనమేనా?

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య తగ్గుతోంది. ఆసుపత్రుల సంఖ్య పెరిగినా, వైద్యులు అందుబాటులో ఉన్నా.. లక్ష్య సాధనలో వెనుకబడుతూనే ఉంది. ప్రసవాలపై ప్రతి నెలా జరుగుతున్న సమీక్షలు కేవలం సమీక్షలుగానే మిగులుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నిర్వహిం చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం, ఆరోగ్య సురక్ష శిబిరాల వల్ల కొందరు వైద్యులు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రులు కొన్నింటిలో ప్రసవాలు మరీ మొక్కుబడిగా ఉన్నాయి.



జిల్లాలో 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నా వాటిలో ప్రసవాలు తక్కువ సంఖ్యలోనే జరుగుతున్నాయి. ఇందులో రామతీర్థం, ముత్తుకూరు, సీతారామపురం, సైదాపురం, కలువాయి, అనంతసాగరం వంటి పీహెచ్‌సీలలోనే 30 నుంచి 60 ప్రసవాలు జరిగాయి. గట్టుపల్లి పీహెచ్‌సీలో ఒక్క ప్రసవం కూడా నమోదు కాలేదు. ఇక మాచవరం, కరేడు, వీకే పాడు. తమ్మలపెంట, సర్వాయపాళెం, ఇస్కపల్లి, చాకలికొండ ఒకటి నుంచి ఏడులోపే ప్రసవాలు జరిగాయి.

సంవత్సరం	ప్రభుత్వ ఆసుపత్రి	ప్రైవేటు ఆసుపత్రి
2019-20	13,395	27,925
2020-21	11,842	23,752
2021-22	7,475	20,743
2022-23	10,641	25,193
2023-24	9422	24,031

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 10 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో తప్పనిసరిగా ప్రసవాలు చేయిం చాలి. గ్రామ స్థాయిలో గర్భవతులను గుర్తించి వారికి ప్రతి నెల దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించాలి. ప్రతి పీహెచ్‌సీలో కనీసం నెలకు పది ప్రసవాలు అయినా చేయించాలి. ప్రధానమంత్రి మాతృవందన కార్యక్రమం కింద గర్భి ణుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు చర్య లు తీసుకోవాలి.... ఇవి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు. అయి తే రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణ వైఫల్యం కారణంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు ప్రహస నంగా మారుతున్నాయి. గత ఏడాది జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 9422 ప్రసవాలు జరగ్గా ప్రైవేట్ ఆసుప త్రుల్లో 24,031 ప్రసవాలు జరగటం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వెల్లడిస్తోంది. నెల్లూరు లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యధికంగా 3607 ప్రసవా లు జరగ్గా, ఆత్మ కూరు జిల్లా ఆసుపత్రిలో 1470, కావలి ఏరియా ఆసుపత్రిలో 931, కందుకూరు ఏరియా ఆసుపత్రిలో 992 ప్రసవాలు జరిగాయి.

సీహెచ్‌సీలలో నామమాత్రం

జిల్లా వ్యాప్తంగా 10 సామా జిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా వాటిలోనూ నామ మాత్రపు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రసవాలకు అన్ని సదుపాయాలు ఉన్నా వైద్యులు ప్రసవాలు చెయ్య డం లేదన్న విమర్శలు న్నాయి. 2023 - 24 ఏడాదిలో వెంకటాచలం సీహెచ్ సీలో 111 ప్రసవాలు మాత్రమే జరగ్గా, ఉలవపాడులో 128, పొదకూరులో 148, ఉదయగిరిలో 150, వింజమూరులో 172, ఇందుకూ రుపేటలో 179, రాపూరులో 193, అల్లూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 236 కాన్పులు జరిగాయి. కాగా ప్రస్తుత ఏడాది సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య మరింత తగ్గింది. కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీలలో ప్రసవాల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ ఏటా ఆసుపత్రు లకు రూ.కోట్లు వెచ్చిస్తున్నా లక్ష్యాలు మాత్రం నెరవేరటం లేదు.

ప్రసవాలపై ప్రత్యేక దృష్టి

పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేలా ప్రత్యేక దృష్టి పెట్టాం. సురక్షితమైన కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రులలోనే చేసేలా అన్ని ఏర్పాట్లు చేశాం. గర్భవతులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలి. ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు గర్భవతుల్ని గుర్తించి వారికి ఎప్పటికప్పుడు వైద్యసేవలు అందించాలని సూచించాం. రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఎక్కువ ప్రసవాలు జరిగేందుకు పూర్తి చర్యలు చేపడుతున్నాం.

- డాక్టర్ పెంచలయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

అగ్రస్థానంలో ఉన్నాం

ప్రసవాల్లో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అగ్రస్థానంలో ఉంది. ఇక్కడ ప్రతినెల 400కుపైగా కాన్పులు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ఎంతో మంది గర్భవతులు ఇక్కడకు వస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు క్రిటికల్ కేసులను ఇక్కడికే పంపిస్తున్నాయి. అనుభవజ్ఞులైన ఎందరో వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారు.

- డాక్టర్ సిద్దా నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఓటు హక్కును వినియోగించుకోవాలి

● ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

● జిల్లా కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

కావలి, ఏప్రిల్ 10: దృఢమైన ప్రజాస్వామ్యం కోసం భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పిలుపు నిచ్చారు. కావలి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు సెల్ఫీ బూత్‌ను బుధవారం కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కావలి, కందుకూరు నియోజకవర్గాల సెక్టోరల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఈనెల 14లోగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల ప్రక్రియలో సెక్టోరల్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, పోలింగ్ ముగిసేవరకు బాధ్యతాయుతంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, రూట్ మ్యాప్‌లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఈవీఎంల మేనేజ్‌మెంట్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటర్లకు డోర్ టూ డోర్ ఓటరు స్లిప్పులను బూత్‌లెవల్ అధికారులు ద్వారా అందించే బాధ్యత సెక్టోరల్ అధికారులు తీసుకోవాలన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రిసైడింగ్ ఆఫీసర్లు, సిబ్బందికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద అప్పగించే ఈవీఎంలు, స్టేషనరీ, పోలింగ్ ముగిసిన తర్వాత రిసెప్షన్ సెంటర్ల వద్ద అప్పగించే ప్రక్రియ వరకు సెక్టోరల్ అధికారులదే పూర్తి బాధ్యతన్నారు. అన్నిరకాల సర్టిఫికెట్లను పూర్తిగా చెక్ చేసుకుని అందజేయాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా ఎప్పటికప్పుడు రిటర్నింగ్ అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కావలి, కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు శీనానాయక్, విద్యాధరి, కావలి మున్సిపల్ కమిషనర్ జీశ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశమని పిలిచి రాజీనామా పత్రాలపై సంతకాలు

● బుచ్చిలో అధికార పార్టీ నేత తీరు ● అవాక్కయిన వలంటీర్లు




సంగం : రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 10 : వలంటీర్ల నెత్తిన వైసీపీ ప్రచార బాధ్యతలు పెట్టేందుకు ఆ పార్టీ నేతలు వలంటీర్లతో రాజీనామా చేయిస్తున్నారనే విమర్శలు పెల్లుబికుతున్నాయి. బుచ్చిరెడ్డిపాళెంలోని 2 సచివాలయాల పరిధిలో 45 మంది వలంటీర్లతో ఇటీవల అధికార పార్టీకి చెందిన ఓ నేత రాజీనామా చేయించినట్లు సమాచారం. సమావేశం పేరుతో వలంటీర్లను తన ఇంటికి పిలిపించుకున్న సదరు నేత వారితో సంతకాలు సేకరించి ఆ తరువాత రాజీనామాల కోసమని చెప్పినట్లు సమాచారం. బుచ్చి నగరపంచాయతీ పరిధిలోని 1వ సచివాలయంలో 21మంది, ఇస్కపాళెం 3వ సచివాలయంలో 24మంది వలంటీర్లతో రాజీనామా చేయించారు. కాగా, వీరందరూ తమ ప్రచారంలో పాల్గొనేందుకే వైసీపీ నాయకులు ఈ రాజీనామాలు పర్వానికి తెరలేపినట్లు సమాచారం. అయితే, ఈ వ్యవహారంపై ఆయా సచివాలయాల కార్యదర్శులు దాటవేత ధోరణిలో మాట్లాడటం గమనార్హం.

● సంగంలో 15 మంది..

సంగం : మండల కేంద్రమైన సంగంలోని మూడు సచివాలయాల పరిధిలో 15 మంది వలంటీర్లు బుధవారం తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో శేషగిరిరావుకు అందచేశారు. సంగం-1లో ఆరుగురు, సంగం-2లో ఐదుగురు, సంగం-3 సచివాలయంలో నలుగురు రాజీనామా చేశారు.



పులి వాహనంపై దర్శనమిస్తున్న సంగమేశ్వరుడు

సంగమేశ్వరుడికి వైభవంగా పులివాహన సేవ

సంగం, ఏప్రిల్ 10: సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి స్వామివారికి పులి వాహన సేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కామాక్షిదేవి సమేత సంగమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలను పులివాహనంపై ఉంచి గజపూలమాలతో అలంకరించారు. అనంతరం సంగం పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి రాజుపాళెం గ్రామానికి చెందిన శ్రీరాంకృష్ణారావు, మోహన్‌లు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు విశేష పూలాలంకరణ చేశారు.

వైసీపీ ప్రచారంలో ఉపాధ్యాయుడు



శెట్టిసముద్రంలో నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్న ఫారుక్ అలీ

మర్రిపాడు, ఏప్రిల్ 10 : ఉద యగిరి మం డలంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఫారుక్ అలీకి ఎన్నికల కోడ్ అంటే లెక్కలేకుండా పోయింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గత నెల 23న మండలంలో మాజీ ఎంపీ మేక పాటి రాజమోహన్‌రెడ్డి చేపట్టిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అయినా ఆయన తీరు మార లేదు. బుధవారం సాయంత్రం శెట్టిసముద్రం, చిలకపాడులో నిర్వహించిన రచ్చబండలో రాజమోహన్‌రెడ్డి వెంట తిరుగుతూ, కార్యక్రమ ఏర్పాట్లను పర్య వేక్షించారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి ఉదయగిరి ఎంఈవోను వివరణ కోరగా ఫారుక్ అలీని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారని, ఆ మేరకు ఉత్తర్వు వచ్చినట్లు తెలిపారు.

28 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, ఏప్రిల్ 10: కావలి మండలం తుమ్మలపెంటలో బుధవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించి ఆవుల కోటేశ్వరరావు అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. అతనిని అదుపులోకి తీసుకుని పరిశీలించగా అతని వద్ద 25 క్వార్టర్ సీసాలు, 3 ఫుల్ బాటిళ్లు ఉండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. అతనిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

మద్యం దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

● స్కాన్ లేకుండా 360 సీసాలు విక్రయించినట్లు గుర్తింపు

కలిగిరి, ఏప్రిల్ 10: కలిగిరి పట్టణంలోని కావలి రోడ్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం(09239)లో బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా స్కాన్ చేయకుండా 360 మద్యం సీసాలు అక్రమంగా విక్రయించినట్లు గుర్తించారు. ఈ దుకాణంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న సంగన మధుసూదన్‌రెడ్డి బెల్టు షాపులకు అక్రమంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నాడన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఒంగోలు విజిలెన్స్ సీఐ వెంకటరెడ్డి తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా స్కాన్ లేకుండా మద్యం సీసాలు విక్రయించినట్లు తేలింది. దీంతో సూపర్ వైజర్‌పై చర్యలకు నివేదికను ఉన్నతాధికారులకు పంపినట్లు సీఐ తెలిపారు.

ప్రజా సంక్షేమం టీడీపీకే సాధ్యం : కాకర్ల



రోడ్‌షోలో మాట్లాడుతున్న కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 10: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి సహకరించాలని ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులతో కలిసి వారు పలు దుకాణాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం పెద్ద మసీదు వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ రాష్ట్రం బాగుడాలంటే ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలన్నారు. గత రెండేళ్లుగా సురేష్ నియోజకవర్గాన్ని తన గుండెల్లో పెట్టుకొని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చిన సురేష్ ను గెలిపిస్తారో.. నాకెందుకు రాజకీయాలు, నన్ను బలవంతంగా నెట్టారుబాబోయ్... అంటున్న వైసీపీ అభ్యర్థిని గెలిపిస్తారో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీకి ప్రజలు శాశ్వతంగా చరమగీతం పాడాలన్నారు. నాసిరకం మద్యం విక్రయాలు చేపడుతూ ఇళ్లు, ఒళ్లు గుల్ల చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ఆడబిడ్డలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అనంతరం కాకర్ల సురేష్ మాట్లాడుతూ జరగనున్న ఎన్నికల్లో తనతోపాటు నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



ఉదయగిరిలో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కాకర్ల సురేష్, తదితరులు

● ఇఫ్తార్ విందులో కాకర్ల

రంజాన్‌ను పురస్కరించుకొని ఉదయగిరి పెద్ద మసీదులోనూ, మండలంలోని మాసాయిపేటలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాకర్ల సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బయ్యన్న, రియాజ్, సందానీ, సజిల్, గడ్డం వెంకటేశ్వర్లు, ఓబులరెడ్డి, బొజ్జా శ్రీనివాసులు, ఖాన్‌షా, మాబాషా, నరసింహా, కలివెల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

13న ఆత్మీయ సమావేశం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 10: ఈనెల 13న హైదరాబాదు మియాపూర్‌లో ఉన్న నరైన్ గార్డెన్స్‌లో ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన వలసవాసులతో ఆత్మీయ స మావేశం నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ సీహెచ్ బయ్యన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెం బ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్ లు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కావున హైదరాబాదులో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రంజాన్‌కు ముస్తాబైన ఈద్గాలు



ఉదయగిరి : నమాజుకు సిద్ధమైన ఈద్గా

ఉదయగిరి, ఏప్రిల్ 10: రంజాన్ సందర్భంగా ముస్లింలు చేసుకునే ప్రత్యేక నమాజుకు ఈద్గాలు సిద్ధమయ్యాయి. మండలంలోని ఉదయగిరి ఈద్గాలతోపాటు బిజ్జంపల్లి, పుల్లాయపల్లి, దాసరిపల్లి, గండిపాళెం, వెంగళరావునగర్ తదితర గ్రామాల్లోని ఈద్గాలను ముస్లింలు నమాజు కోసం సిద్ధం చేశారు.

అనంతసాగరం: రంజాన్‌ను గురువారం నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమశిల, అనంతసాగరం, ఉప్పలపాడు, పాతదేవరాయపల్లి, ఆమనిచిరువెళ్ల, కేడీపల్లి గ్రామాల్లోని ఈద్గా పరిసరాలను శుభ్రం చేశారు. ఈద్గాలకు రంగులు దిద్ది సుందరంగా అలంకరించారు.

21న ప్రవేశ పరీక్ష

సీతారామపురం : స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ ముజీబుర్ రెహమాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. హాల్‌టికెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

ఆలయ పునర్నిర్మాణానికి పూజలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

ఉదయగిరి రూరల్ : మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కాలనీలో 15 ఏళ్ల క్రితం రామాలయ నిర్మాణం చేపట్టారు. అనివార్య కారణాల వల్ల మధ్యలో ఆగింది. ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కాలనీ వాసులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. త్వరితగతిన ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వారు తెలిపారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా గంధమహోత్సవం

ఉదయగిరి : స్థానిక కోన కాలువ సమీపంలో వెలసి ఉన్న అబీద్‌బాబా గంధ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అబీద్‌బాబా మహారాజ్ ట్రస్టు నిర్వాహ కులు సమీపంలోని అమ్మాజీ ఆస్థానం నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి చదివింపుల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. దర్గా వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

అనంతవరంలో మాలేపాటి ప్రచారం

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 10: దగదర్తి మండలం అనంతవరం పంచాయతీలో బుధవారం టీడీపీ కావలి నియోజకవర్గ నేత మాలేపాటి సుబ్బానాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించడమే ప్రధాన లక్ష్యం అన్నారు.

పూలే జయంతి సభను జయప్రదం చేయండి

కందుకూరు, ఏప్రిల్ 10: ఈనెల 11న సాయంత్రం కనిగిరి రోడ్డులోని విజయగాయత్రీ ఫంక్షన్ హాలులో జరిగే జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పూలే విగ్రహ కమిటీ, బీసీ సంఘాల సభ్యులు సంగా రమణయ్య, హరిప్రసాద్, శివయ్య, మల్లికార్జున, మహేంద్ర, మాల్యాద్రి, పెరుగు ప్రసాద్, రాజేశ్వరరావు, మోహనరావు, వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం సభ్యులు మాట్లాడారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

మీ బిడ్డగా ఆశీర్వదించండి : ఇంటూరి



ఇంటూరికి తిలకం దిద్ది ఆశీర్వదిస్తున్న మహిళ

వలేటివారిపాలెం, ఏప్రిల్ 10 : నన్ను మీ బిడ్డగా భావించి ఆశీర్వదిస్తే మన ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం, అంకభూపాలపురం, పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, పోలినేనిచెరువు, గరుకుపాలెం గ్రామాలలో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

టీడీపీలో పలువురి చేరిక : పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, పోలినేని చెరువు, గరుకుపాలెం గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి నాగేశ్వరావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు సిరిగిరి కొండారెడ్డి, ప్రైగడ నరసింహం, లాయర్ శ్రీనివాసులు, చెంచు శ్రీనివాసులు, బక్కమంతుల మాల్యాద్రి, శనివారపు సాంబయ్య, శనివారపు మాల్యాద్రి పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థుల కోసం ఇంటింటి ప్రచారం

కందుకూరు : పట్టణంలోని 4వ వార్డు పరిధిలోని కుంచాల ట్రస్టు ఎదురు ప్రాంతంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గట్టమనేని హరిబాబు, టీడీపీ నాయకులు మచ్చా మనోహర్, ముచ్చు శ్రీను, సవిడిబోయిన వెంకటకృష్ణ, నందికన మల లక్ష్మణరావు, చీదెళ్ల పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరాచకాలకు చరమగీతం పాడాలి : కావ్య



గాయిత్రీనగర్‌లో ప్రచారం చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 10: కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అరాచకాలకు చరమగీతం పాడుదామని కావలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని 2వ వార్డులోని గాయత్రీనగర్, ఇస్లాంపేట ప్రాంతంలో బుధవారం ఆయన బీజేపీ, జనసేన నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. అలాగే 23వ వార్డులో ఆలా శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు వారి అనుచరులతో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ప్రచారం నిర్వహించారు. ముస్లిం మహిళలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బోగోలుకు చెందిన వైసీపీ వార్డు మెంబరు సంజీవయ్య, స్వతంత్ర వార్డు మెంబరు మేకల కిరణ్ వారి అనుచరులతో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలేపాటి నాగేశ్వరావు, నూకసాని శ్రీనివాసులు యాదవ్, షేక్.నూరుద్దీన్, అహ్మద్‌బాషా, ఎల్.సుధీర్‌బాబు, వెంకటేశ్వర్లురెడ్డి, అంజయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కష్టపడి పనిచేయండి : ఆనం



దువ్వూరులో మాట్లాడుతున్న రామనారాయణరెడ్డి

సంగం, ఏప్రిల్ 10: టీడీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలంలోని దువ్వూరు, మర్రిపాడు, చెన్నవరపాడు, తరుణవాయి గ్రామాల్లో వేర్వేరుగా జరిగిన టీడీపీ సమావేశాల్లో పేర్కొన్నారు. మొదట దువ్వూరులో కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం మర్రిపాడు, చెన్నవపాడు, తరుణవాయి గ్రామాల్లో కూడా కార్యకర్తల సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, శేఖరయ్య, రవీంద్రరెడ్డి, బాణా శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని వెంగారెడ్డిపాళెంలో సర్పంచు ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనుమూరు సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆత్మకూరు : అభివృద్ధి ప్రధాత, టీడీపీ కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిని, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని పట్టణ ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని ఆనం కుమార్తె ఆనం కైవల్యారెడ్డి, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని సత్రం సెంటర్ వద్ద నుంచి ప్రధాన రహదారి వెంబడి మహిళలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పసుపులేటి గూటికి వైసీపీ నేతలు



పసుపులేటికి మద్దతు తెలిపిన వైసీపీ నేతలు

కావలిటౌన్, ఏప్రిల్ 10: స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ గూటికి రోజు రోజుకు నేతల చేరికలు పెరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం పట్టణంలోని పీఎస్సార్ కార్యాలయంలో రూరల్ మండల చలంచర్లకు చెందిన వైసీపీ నాయకులు టీ.యామయ్య, తన అనుచరులు వైసీపీని వీడి పసుపులేటి కండువాలు కప్పుకున్నారు. యామయ్య మాట్లాడుతూ పసుపులేటి పార్టీలకతీతంగా గ్రామా ల్లో సొంత నిధులతో మౌలిక వసతులు సమకూరుస్తుండడంతో ఆకర్షితులై పసుపులేటికి మద్దతు పలుకుతున్నామన్నారు. పసుపులేటి మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలు కలుషితమయ్యాయని దోచుకోవడం, దాచుకోవడం కోసమే ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ పడుతున్నారన్నారు. జన్మభూమి రుణం తీర్చుకోవడమే ప్రధాన లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పోరాడుతానన్నారు. కార్యక్రమంలో టీం పసుపులేటి సభ్యులు బాబు, శ్రీనివాస్, మల్లికార్జున్, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో వైసీపీ కీలక నేతల చేరిక

అల్లూరు, ఏప్రిల్ 10 : అల్లూరులో వైసీపీ కీలక నేతలు పాపాల విజయకుమార్‌రెడ్డి, బత్తల గోపాల్, బత్తల శ్రీనివాసులు తదితరులు బుధవారం రాత్రి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డి, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, ఎ.చందన్‌రెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే మండలంలోని పురిణి కొత్తపాలెంకు చెందిన 10 వైసీపీ కుటుంబాలు ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మర్రిపాటి వెంకటేశ్వర్లు, నెల్లూరు గోపి, నెల్లూరు శ్రీకాంత్, ఆలపాక కిరణ్, తదితరులు ఉన్నారు. అంతకుముందు అల్లూరు పట్టణ పరిధిలోని కట్టకింద అరుంధతీయవాడ, సెటల్మెంటు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, అరగల రమణయ్య, కత్తుల శ్రీకాంత్, తిరువీధి అనూరాధ, కరీమా తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన నేతలు

కందుకూరు, ఏప్రిల్ 10: కందుకూరు నియోజకవర్గంలోని ముస్లింలకు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి, ఎమ్మెల్సీలు తూమాటి మాధవరావు, కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నేత ఇంటూరి రాజేష్‌లు వేర్వేరు ప్రకటనల్లో రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టండి : ప్రశాంతిరెడ్డి



ఇందుకూరుపేట: ప్రచారం నిర్వహిస్తున్న ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 10: వైసీపీ నేతల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని కోవూరు నియోజకవర్గ శాసన సభ టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొమరిక గ్రామంలో బుధవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేసి తెలుగుదేశం ప్రభుత్వం రాగానే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాలలో తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ముదివర్తి పాలెం, కొమరిక లింక్ రోడ్డు, వారణాసి కండ్రిగ, మైపాడు లింక్ రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో హెల్త్ సెంటర్‌ను అధికారంలోకి రాగానే అభివృద్ధి అభివృద్ధి చేస్తామన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, చెంచుకిషోర్ యాదవ్, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాస్‌రెడ్డి, అవ్వారు ఏడుకొండలు, మునగాల రంగారావు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే పార్టీలకతీతంగా అభివృద్ధి

బుచ్చిరెడ్డిపాళెం: టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కులాలు, మతాలు, పార్టీలకతీతంగా రాష్ట్రం అభివృద్ధితోపాటు వివాద రహిత నియోజకవర్గాన్ని మీకు అందిస్తానని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఇస్కపాళెం, వడ్డిపాళెం గ్రామాలలో టీడీపీ జాతీయ నాయకుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, గ్రామ టీడీపీ నాయకుడు బత్తల హరికృష్ణతోపాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ టీడీపీని గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన సంక్షేమ పథకాలన్నీ తిరిగి అమలౌతాయని హామీ ఇచ్చారు.

● బుచ్చిలోని టీడీపీ కార్యాలయంలో వైసీపీకి చెందిన మాజీ ఎమ్పీటీసీ సభ్యులు ఫిరోజ్‌ఖాన్, కొండారెడ్డి, చెల్లాయపాళెం ఉప సర్పంచు, కోవూరు మురళి, కల్యాణ్, రామకృష్ణ, బుచ్చి 4, 5, 6 వార్డులతోపాటు ఇస్కపాళెం, చెల్లాయపాళెం, సాల్మానుపురం గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఎంవీశేషయ్య, సూరా శ్రీనివాసులురెడ్డి, హరికృష్ణ ఆధ్వర్యంలో వారందరికీ ప్రశాంతిరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వేమిరెడ్డి దంపతులను గెలిపించాలి

వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరుతూ వారి కుమారుడు అర్జున్‌రెడ్డి బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 8, 9 వార్డుల్లో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆ వార్డుల ఇన్‌చార్జ్‌లు వింజం రామానాయుడు, వింజం మహేష్‌లతో కలిసి అర్జున్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవీ శేషయ్య, ఎర్రంరెడ్డి గోవర్దన్‌రెడ్డి, పుట్టా సుబ్రమణ్యంనాయుడు, సూరా శ్రీనివాసులురెడ్డి, నాయకులు కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

లక్ష్మీ సాయిప్రియను ఆదరించండి : కురుగొండ్ల



ఆర్‌వైజీ పాళెంలో మాట్లాడుతున్న కురుగొండ్ల

సైదాపురం, ఏప్రిల్ 10: వెంకటగిరి టీడీపీ అభ్యర్థి, తన కుమార్తె కురుగొండ్ల లక్ష్మీ సాయిప్రియను ఆశీర్వదించండి... మీకు అండగా నేనుంటానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఆర్‌వైజీ పాళెం, చీకవోలు గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆర్‌వైజీ పాళెంలో జనార్దన్‌రాజు, పందేటి వెంకటరాజుల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 12 కుటుంబాలు, చీకవోలులో తోట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 15 కుటుంబాల వారు టీడీపీలో చేరాయి. కురుగొండ్ల వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తన బిడ్డను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలన్నారు. కార్యక్రమంలో పెంచలకోన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ తానంకీ నానాజీ, నాయకులు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, వరదబండి హరనాథ్‌రెడ్డి, శివరామరా జు, వెంకటేశ్వర్లురాజు పాల్గొన్నారు.

జూన్ 4 తర్వాత కాకాణి జైలుకే : సోమిరెడ్డి



వెంకటాచలం: టీడీపీలో చేరిన వారితో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, ఏప్రిల్ 10: ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే జూన్ 4వ తేదీ తర్వాత తాను అసెంబ్లీకి వెళ్తే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాత్రం జైలుకు వెళ్లడం ఖాయమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జోస్యం చెప్పారు. నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న ఆయన కార్యాలయంలో బుధవారం వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన యమల రాజేంద్ర ఆధ్వర్యంలో వైసీపీ 9వ వార్డు మెంబర్ ఉప్పు రాఘవేంద్ర, వెంకటేశ్వర్లు, మస్తాన్‌రావు, మురళీ, అనిల్, శ్రీహరి, వెంకటరమణయ్య, అంకయ్యలతో సహా 24 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తురక సుధాకర్, వలిపి మునిరత్నం, బాబురావు, చిరంజీవి, అశోక్, గజ తదితరులున్నారు.

కాకాణి అనుచరుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తాం

తోటపల్లిగూడూరు: గ్రామాల్లో కాకాణి అనుచరుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామని, ప్రజలకు అండగా ఉంటామని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పేడూరు దళిత కాలనీ, కోవెరపాలెం, తోటపల్లి గ్రామాలలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ కాకాణి అండదండలతో గ్రామాల్లో వారి అనుచరులు భూకబ్జాలు, బెదిరింపులకు పాల్పడుతున్నారని టీడీపీ సానుభూతిపరుల గృహ నిర్మాణాలు బిల్లులు ఆపుతున్నారని, ఇక వారి అరాచకాలకు అడ్డుకట్ట వేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, ముత్యాల గణేష్, తలమంచి నాగేశ్వరరావు, తోటపల్లి రామ్మోహన్, గంగపట్నం సుధీర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని పొట్లపూడి, పేడూరు గ్రామాలలో బుధవారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. పొట్లపూడి నుంచి 70 కుటుంబాలు, పేడూరు గ్రామం నుంచి 70 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

30 రోజుల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు

వెంకటాచలం, ఏప్రిల్ 10: రాబోయే 30 రోజుల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జోస్యం చెప్పారు. మండలంలోని కంటేపల్లి గ్రామంలో బుధవారం కూటమి తరపున సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపు కోసం తనయుడు రాజగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాజాయాదవ్, ధనుంజయనాయుడు, వెంకటసుబ్బయ్య, మునుస్వామి, ప్రసాద్‌యాదవ్, గోపాలయ్య, చెంచురామయ్య, మల్లికార్జున్, నాగరాజు, నందకిషోర్, రవికుమార్, రఫీ, సుధాకర్, సుబ్బయ్య, ఏడుకొండలు తదితరులున్నారు.

బద్దెవోలులో టీడీపీ ఇంటింటా ప్రచారం


మనుబోలు : మండలంలోని బద్దెవోలు గ్రామంలో సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి తన తండ్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మెజారిటీతో సోమిరెడ్డి గెలుపు తథ్యం : బొద్దులూరి

పొదలకూరు : అత్యధిక మెజారిటీతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపు తథ్యమని పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు అన్నారు. బుధవారం పట్టణంలోని బాలాజీనగర్ మూడు వీధుల్లో ఇంటిం టికీ తిరిగి కరపత్రాలు పంచి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అలాగే వినాయక మాన్యంలో టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్, వీరేంద్ర ఆధ్వర్యంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, స్థానిక యువత ప్రచారం నిర్వహించారు.







సంగమేశ్వరుడికి చప్పర సేవ



మనుబోలు, ఏప్రిల్ 10: శ్రీకామాక్షి తాయి సంగమేశ్వర బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామికి చప్పరసేవ నిర్వహించారు. పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను అలంకరించి చప్పరంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు సర్వేపల్లి ఫణీంద్రశర్మ పూజలు నిర్వహించారు. గ్రామస్థులు నైవేద్యాలు చెల్లించి స్వామికి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా గంగమ్మ గ్రామోత్సవం

మనుబోలు, ఏప్రిల్ 10: స్థానిక పెద్దచెరువు వద్ద వెలసి ఉన్న గంగమ్మ పరమేశ్వరీ గ్రామోత్సవం మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. యాదవసంఘం ఆధ్వర్యంలో అమ్మవారి గ్రామోత్సవం బుధవారం వేకువజాము వరకు సాగింది.

వైభవంగా మహాలక్ష్మి గ్రామోత్సవం

వెంకటాచలం, ఏప్రిల్ 10: మండలంలోని ఈదగాలి పంచాయతీ పాతూరులోని మహాలక్ష్మి అమ్మవారి దేవ స్థానం వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉ త్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలుచేసి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో విహరించిన అమ్మవారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఉత్సవానికి ఉభయకర్తలుగా టంగుటూరు శైలజారెడ్డి, చల్లా యామినిరెడ్డి, చల్లా నాగార్జున్‌రెడ్డి, అల్లూరు కమలా కర్‌రెడ్డి, బొజ్జ అశోక్‌రెడ్డి, వడ్డెర, గౌడ, పల్లెకాపుల సంఘా లు వ్యవహరించాయి.

ఉపాధి పనుల తనిఖీ

రాపూరు(డక్కిలి), ఏప్రిల్ 10: మండలంలోని మసీదుపేటలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం డ్వామా పీడీ వెంకట్రావు తనిఖీ చేశారు. ఎండతీవ్రత రోజు రోజుకు పెరుగుతున్న దృష్ట్యా ఉపాధి పనులను ఉదయం మాత్రమే చేపట్టాలని ఆయన సూచించారు. పనులు జరిగే ప్రదేశంలో షామియానాలు, మంచి నీటి వసతి విధిగా ఏర్పాటుచేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. అనంతరం అక్కడ జరుగుతున్న పనుల వివరాలు తెలుసుకున్నారు. ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

సేవకులకు గౌరవం ఇవ్వాలి

నెల్లూరు (సాంస్కృతికం): వివిధ సేవా కార్యక్రమాలు చేసే వారిని గౌరవిస్తూ వారిలో నైతిక శక్తిని పెంచాలని కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేతా సుబ్బా రావు పిలుపునిచ్చారు. బుధవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి. సామాజిక సేవకుడు అక్కం పాక లక్ష్మీపతికి ఉగాది పురస్కారం అందజేశారు.

ఏ సమస్యవచ్చినా అండగా నిలుస్తాం..

● పొంగూరు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నారాయణ, వేమిరెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 10 : వైద్యులకు ఏ చిన్న సమస్య వచ్చి నా వారికి అండగా నిలిచి సమ స్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నగరంలోని 45వ డివిజన్‌లో వారు పర్యటించారు. ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన నెల్లూరును రూపుదిద్దడమే లక్ష్యంగా తాము పనిచేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తమకు అండగా ఉండి ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ జెడ్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 5, 16, 49 డివిజన్లలో డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేసి రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి పెద్దపీట వేసి నారాయణను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నగరంలోని 47వ డివిజన్ కామాటి వీధిలో అగ్నికుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వేమిరెడ్డి, నారాయణ పాల్గొన్నారు. వారి సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. అదేవిధంగా 45, 47 డివిజన్లలో పొంగూరు నారాయణ కుమార్తె సింధూర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమవుతుందని, నెల్లూరును స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేందుకు తన తండ్రిని ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. 10వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన నారాయణ కుమార్తె శరణి మాట్లాడుతూ మే 13వతేదీన ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని, అభివృద్ధి మీ చేతుల్లోనే ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ ఆగడాలకు అడ్డుకట్ట పడాలంటే తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు.

టీడీపీ ప్రభుత్వంలోనే మహిళా సంక్షేమం: కేతంరెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 10 : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే మహిళాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన నగరంలోని 8వ డివిజన్‌లో పర్యటించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో మహిళాశక్తికి చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తారన్నారు. ప్రజలంతా టీడీపీకి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

నాకోసం 33 రోజులు కష్టపడండి

● ఎన్నికల ప్రచారంలో రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి



ఎన్నికల ప్రచారంలో శ్రీధర్‌రెడ్డికి దిష్టిబొట్టుపెడుతున్న మహిళ

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 10 : రూరల్ నియోజకవర్గం లోని ప్రజలు తనకోసం 33 రోజులు కష్టపడి మద్దతుగా నిలిస్తే ఆపై రాబోయే ఐదేళ్లు వారందరికీ అండగా నిలుస్తానని ఆ నియో జకవర్గ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధ వారం 33,34,35 డివిజన్లతోపాటు మండలంలోని కొత్తవెల్లంటి, పాతవెల్లంటి గ్రామాల్లో ఆయన పర్యటించారు. వచ్చే నెల 13న జరగబోవు ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించేవన్నారు. ప్రతి ఓటరు తెలివిగా ఆలోచించి భవిష్యత్ తరాల వారికి దారిచూపే టీడీపీని గెలిపించేందుకు సైకిల్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థించారు. అనంతరం దేవరపాళెంకు చెందిన వైసీపీ నాయకుడు నాపా వెంకటేశ్వర్లుకు తన కార్యాలయంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పాతవెల్లంటిలో సతీష్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, కోట శ్రీనివాసులు రెడ్డి, రామచంద్రారెడ్డితోపాటు పలువురిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

హోమియోపతిపై అవగాహన

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 10 : హోమియా వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హాన్‌మ్యాన్ 235వ జయంతిని పురస్కరించుకుని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం హోమియోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ హోమియావైద్యంతో ఎన్నో వ్యాధులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి రామారావు, ప్రధాన కార్యదర్శి గుర్రం సురేంద్ర బాబు, కోశాధికారి అరిగెల సాయిరాం, మాజీ అధ్యక్షుడు వేలూరు రంగారావు, కిలారి తిరుపతినాయుడు, బాసం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలయ్యేవరకూ అప్రమత్తంగా ఉండండి : ఎస్పీ

మనుబోలు, ఏప్రిల్ 10: సాధారణ ఎన్నికలయ్యేవరకూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీస్‌బాస్ ఆరీఫ్‌హఫీజ్ హెచ్చరించారు. స్థానిక ఠాణాను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎన్నికల సమయంలో చేయాల్సిన విధి నిర్వహణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనుక్షణం ఎన్నికల నియమావళిపై నిఘా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాంబాబు, ఎస్ఐ అజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

మంత్రి ప్రచారం

మనుబోలు, ఏప్రిల్ 10: మండలంలోని పిడూరు, కాగితాలపూరు, లక్ష్మీనరసింహపురం గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, తిక్కవరపు వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

వెంకటాచలం, ఏప్రిల్ 10: మండలంలోని సర్వేపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 12 మద్యం సీసాలను బుధవారం ఎస్ఐ రాజేష్ స్వాధీనం చేసుకున్నారు. ఒక వ్యక్తి నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.



తామర్లతో అర్చన, మోదుగతో హోమం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 10 : నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం ఉదయం స్వామివారికి పాలతో అభిషేకం జరిగింది. అనంతరం తామర పుష్పాలతో ఉదయం, రాత్రి అర్చన, మోదుగ సమిధలతో ఉదయం, సాయంత్రం హోమాలు జరిగాయి. కార్యక్రమాలను ఉభయకర్తలు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

రబీలో సరాసరి దిగుబడి మూడున్నర పుట్లు

● ఏడీఏ శ్రీనివాసులు

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 10 : ప్రస్తుత రబీ వ్యవసాయ సీజన్‌లో నెల్లూరు రూరల్ మండలంలోని గ్రామాల్లో సరాసరి దిగుబడి ముడున్నర పుట్లుగా చేతికందినట్లు వ్యవసాయ శాఖ నెల్లూరు డివిజన్ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు తెలి పారు. బుధవారం మండలం లోని ములుముడి, దేవరపాళెం, సౌత్‌మోపూరు గ్రామాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్కడక్కడ ఎకరాకు నాలుగు పుట్లు, మూడు పుట్ల ధాన్యం దిగుబడి వచ్చిందని చెప్పారు. మరో 10 రోజుల్లో రబీ పూర్తిగా ముగుస్తు న్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగమోహన్, వీఏఏ రామలక్ష్మీ, ఎస్బీఐ ఇన్సూరెన్స్ కోఆర్డినేటర్ పెంచల నరసయ్య పాల్గొన్నారు.

జైభారత్ నేషనల్ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా గాజుల సాగర్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 10 : జైభారత్ నేషనల్ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా గాజుల సాగర్ (సోమశేఖర్)ను నియమిస్తూ ఆ పార్టీ అధినేత వీవీ లక్ష్మీనారాయణ జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ తనకు ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించిన పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపారు.

కరోనా నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ

● హైకోర్టు న్యాయవాది నాగరాజారావు

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 10 : కరోనా సమయంలో నిధుల గోల్‌మాల్‌పై సమగ్ర విచారణ జరిపించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి ఆదేశాలివ్వటం శుభ పరిణామమని హైకోర్టు న్యాయవాది, హెల్ప్ గ్రూప్ కార్యదర్శి నాగరాజరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తూతూ మంత్రంగా విచారణ జరిపించాలని అనుకుంటున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. కరోనాలో ఎక్కువ ఫీజులు వసూలు చేసిన ఆసుపత్రులపై సరైన చర్యలు చేపట్టాలని, ఏపీ ప్రైవేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

కోవూరు బీఎస్పీ అభ్యర్థిగా కడింపాటి

కోవూరు, ఏప్రిల్ 10: కోవూరు నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా కొడవలూరు మండల పరిధిలోని ఎల్లాయపాళెం గ్రామానికి చెందిన కడింపాటి అనిల్‌ను రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పరంజ్యోతి ప్రకటించారు. బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

బీసీవై నెల్లూరు నగర అభ్యర్థిగా..

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 10 : నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గానికి భారత చైతన్య యువ జన పార్టీ(బీసీవై) తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా నెల్లూరు నగరానికి చెందిన కాళహస్తి చెంచు మహేష్ వర్మను నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ జాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా మహేష్ వర్మ మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించి నెల్లూరు నగర అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

సైదాపురాన్ని అభివృద్ధి చేస్తా

సైదాపురం, ఏప్రిల్ 10: మీరు ఆశీర్వదిస్తే సైదాపురం మండలాన్ని అభివృద్ధి చేస్తానని వెంకటగిరి వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కట్టుబడిపల్లి, దేవరవేమూరు, తురిమెర్ల, గ్రిద్దలూరు, ఊటుకూరు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు.

పెత్తందారుల అరాచకాలను తిప్పికొడదాం!

● బీజేపీ-టీడీపీ-జనసేన ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్



వెంకటగిరిలో జరిగిన ఆత్మీయ సమావేశంలో వరప్రసాద్

వరదయ్యపాళెం/తడ/ వెంకటగిరి, ఏప్రిల్ 10: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ,జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రంలో పెత్తందారుల అరాచకాలను తిప్పికొడదామని ఆ పార్టీల తిరుపతి పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి, గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.వరదయ్యపాళెంలో బుధవారం జరిగిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీలోని పెత్తందారుల అడుగులకు తాము మడుగులు ఒత్తలేదన్న కారణంగా కక్ష కట్టి పార్టీ నుంచీ తనను, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని బయటికి పంపించేశారని ఆరోపించారు.

● **తడలో టీడీపీ నేతలతో వరప్రసాద్ భేటీ**

ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ బుధవారం తడలో మండలానికి చెందిన టీడీపీ నేతలను కలుసుకున్నారు. ఎన్నికల్లో తన గెలుపునకు సహకరిం చాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు.



తడలో టీడీపీ నేతలతో వరప్రసాద్

● **వెంకటగిరిలో ఆత్మీయ సమావేశం**

వెంకటగిరిలో బుధవారం నియోజకవర్గ స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నుంచీ గెలవడం ద్వారా కేంద్ర సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి బంగారు బాటలు వేసేందుకు అవకాశం వుంటుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రధాని కావడం కోసం తిరుపతి నుంచీ బీజేపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని, దానికోసం శ్రేణులు కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసీపీ ఆశలకు బ్రేక్ రాజీనామాలకు

చంద్రబాబు పదివేల వేతనం ప్రకటనతో డైలమాలో వలంటీర్లు

గత రెండేళ్ళగా వైసీపీ ప్రభుత్వం వలంటీర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంది. పేరుకు ప్రభుత్వ గౌరవ ఉద్యోగమే కానీ ఎక్కడికక్కడ స్థానిక వైసీపీ నాయకుల కనుసన్నల్లో వీరు పనిచేయాల్సి వచ్చింది. ఇంత చేసినా వేతనం అతి తక్కువ. ఎన్నికల్లో ప్రభుత్వం మారితే.. తమ భవిష్యత్తు ఏమిటన్న ఆందోళన వీరిలో ఉంది. దీన్నే వైసీపీ అనుకూలంగా మార్చుకుంది. టీడీపీ అధికారంలోకి వస్తే వలంటీర్లు ఉండరని నమ్మబలికింది. ఇదే సమయంలో వైసీపీ నేతల వెంట ప్రచారంలో ఉన్న వలంటీర్ల సమాచారం ఫొటోలు సహా వెలుగులోకి రావడంతో వీరిపై చర్యలు తీసుకుంటున్నారు. 'మీకిక మరోదారి లేదు.. రాజీనామాలు చేసి వచ్చేయండి ఈ రెండు నెలలూ రెట్టింపు జీతాలు ఇస్తాం' అని ఆ పార్టీ నాయకులు ఎర వేయడంతో వలంటీర్లు కూడా మూకుమ్మడిగా రాజీనామాలు చేసేయడం మొదలు పెట్టారు. తిరుపతి జిల్లాలో 196 వార్డు, 495 గ్రామ సచివాలయాలు చొప్పున మొత్తం 691 సచివాలయాల పరిధిలో 11875మంది వలంటీర్లు పనిచేస్తున్నారు.వారిలో గత నెల ఎన్నికల షెడ్యూలు వెలువడిన తర్వాత 300మందికి పైగా రాజీనామా చేశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని 18మందిని తొలగించారు. వైసీపీ నేతలు ఒత్తిడి పెంచి పెద్ద సంఖ్యలో రాజీనామాలు చేయించడం మొదలుపెట్టారు. చంద్రబాబు ప్రకటనతో వలంటీర్లు ఆలోచనలో పడ్డారు.

కాస్తో కూస్తో చదువుకున్న అనేకమంది, అందులోనూ మహిళలు వలంటీర్లుగా చేరారు. స్థానికంగా ఉండే వైసీపీ నాయకుల అండదండలతోనే ఎక్కువమంది ఈ కొలువుల్లో కుదురుకున్నారు.ఈ నాయకుల రుబాబు ఎక్కువైనా మౌనంగా భరిస్తున్నారు. ఉన్న చోటనే ఆ కాస్త డబ్బులైనా వస్తున్నాయనే సంతృప్తితో పనిచేస్తున్నారు. కరడుగట్టిన వైసీపీ అనుచరులు మినహా, ఇటువంటి వారిలో చంద్రబాబు ప్రకటన కొత్త ఆశను చిగురింపజేసింది. పదివేలు అంటే తక్కువేమీ కాదు. పైగా వలంటీరు వ్యవస్థ కొనసాగుతుందని చెబుతున్నారు. ఈ నెల రోజులూ రాజీనామా చేయకుండా, ఏదోలా సాగదీసేస్తే చాలు కదా అనుకుంటున్నారు. రాజీనామా చేసేయాలనే నిర్ణయం తీసుకున్న వారు కూడా పునరాలోచనలో పడుతున్నారని తెలిసింది. బుధవారం వెంకటగిరి మున్సిపాలిటీలో 45 మంది, రేణిగుంట మండలం గుత్తివారిపల్లిలో ఏడుగురు మాత్రమే రాజీనామా లేఖలు అందజేశారు. జిల్లాలో మరెక్కడా ఎవరూ రాజీనామా చేయలేదు. దీన్నిబట్టి చూస్తే ఎన్నికల్లో ఎడాపెడా వాడేద్దాం అనుకున్న వలంటీర్లు వైసీపీ ఆశించినట్టుగా ఉపయోగపడేట్టు లేరు. అయితే చంద్రబాబు మాటలు నమ్మొద్దు అని వైసీపీ నాయకులు వీరి వెంటపడుతున్నట్టు తెలుస్తోంది. వలంటీర్లకు పది వేలు ఇస్తామన్న హామీని ఎన్నికల మేనిఫెస్టోలో పెడితే తమకు మరింత నమ్మకం కలుగుతుందని కొందరు వలంటీర్లు అంటున్నారు. ఇదే జరిగితే వలంటీరు వ్యవస్థ మొత్తం వైసీపీని వదిలి చంద్రబాబు వైపు చేరే అవకాశం ఉందంటున్నారు.

15 నుంచి వేటకు విరామం



తూపిలిపాళెం తీరం వద్ద ఒడ్డుకు చేర్చివున్న పడవలు

కోట, ఏప్రిల్ 10 :ప్రతి ఏడాది మాదిరిగానే సముద్ర జలాల్లో 61రోజుల పాటు చేపల వేటను నిషేధిస్తున్నట్లు కోట మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రెడ్యానాయక్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.కోట, వాకాడు మండలాలతో పాటు చిల్లకూరు మండలంలోని గుమ్మళ్లదిబ్బ తీరప్రాంతాలకు సంబంధించి సముద్రంలో చేపలవేటను ఈ నెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. సముద్ర జలాల్లో చేప, రొయ్యల జాతులు సంతానోత్పత్తి, గుడ్లు పెట్టేకాలంలో తల్లి చేపలను, తల్లి రొయ్యలను పరిరక్షించడంతోపాటు వాటి సంతతిని ప్రోత్సహించడం కోసం చేపలవేటను నిషేధించినట్లు తెలిపారు.వేట విరామ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం జీవనోపాధి కోసం రూ.10 వేలు అందించడం జరుగుతుందన్నారు.ఎవరైనా చేపల వేటకు వెళ్లితే వారి బోట్ లైసెన్స్, హెచ్ఎస్‌డీ ఆయిల్‌కార్డు, మత్స్యకార భరోసా కింద ఇచ్చే రూ.10వేలు రద్దు చేయడం జరుగుతుందన్నారు.నిషేధ కాలాన్ని ఖచ్చితంగా అమలు చేసేందుకు మత్స్యశాఖ, కోస్టుగార్డు, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు.చేపల వేట విరామానికి 4 రోజులు మాత్రమే సమయం ఉండటంతో కోట మండలంలోని గోవిందపల్లి పాళెం, కొత్తపట్నం, శ్రీనివాససత్రం గ్రామాల సమీపంలోని సముద్రపు ఒడ్డున ముందుగానే తమ పడవలు, వలలను మత్స్యకారులు భద్రపరుచుకున్నారు.

ముగ్గురు ఎస్వీయూ ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు

- వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమే కారణం

తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. కొన్ని రోజుల క్రితం వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంతో కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందినట్టు సమాచారం. దీంతో చర్యల కోసం ఎన్నికల కమిషన్ యూనివర్సిటీ అధికారులను ఆదేశించిన క్రమంలో అయ్యప్ప (డ్రైవర్), డాక్టర్ ఐఎస్ కిషోర్ మాథ్యూ అర్నాల్డ్ (అకడమిక్ కన్సల్టెంట్), మురళిరెడ్డి (రిజిస్ట్రార్ పీఎస్) లను సస్పెండ్ చేసినట్టు సమాచారం.ఈ ముగ్గురినీ విధుల నుంచీ తొలగిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ బుధవారం ఉత్తర్వులు వెలువరించినట్టు సమాచారం.

ఆ అక్రమ నియామకాలను రద్దు చేయాల్సిందే?

- ఎస్వీయూ వీసీకి కమిషనర్ సూచన

తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ముందు పెట్టుకుని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలపై ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది.ఆ అక్రమ నియామకాలను రద్దు చేయాల్సిందేనని విచారణాధికారిగా ఉన్న తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్ సూచించినట్టు తెలుస్తోంది. బుధవారం మున్సిపల్ కార్యాలయానికి వీసీ శ్రీకాంత్ రెడ్డి మరోసారి విచారణకు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత విధుల్లో చేరిన 12 మంది నాన్ టీచింగ్ సిబ్బంది రాజకీయ ఒత్తిళ్లతోనే నియమించినట్లు విచారణలో వెల్లడైనట్టు సమాచారం. దీంతో వారిని తొలగింగిచాలని ఎన్నికల అధికారులు వీసీకి సూచించినట్టు తెలుస్తోంది.

టౌన్ బ్యాంకు మేనేజర్ సస్పెన్షన్

వైసీపీ ఆత్మీయ సభలో పాల్గొన్న ప్రభావం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న తిరుపతి కోఆపరేటివ్ (టౌన్ బ్యాంకు)బ్యాంకు మేనేజర్ ప్రభాకర రెడ్డి (పాండు)పై బుధవారం సస్పెన్షన్ వేటు పడింది. టౌన్ బ్యాంకు మాజీ ఉద్యోగులకు మెడికల్ బిల్స్ ఇస్తామని శనివారం ఒక హోటల్‌కు పిలిపించి వైసీపీ అభ్యర్థి అభినయ్ రెడ్డితో సమావేశం ఏర్పాటుచేశారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'వైసీపీ ఆత్మీయ సభలో టౌన్ బ్యాంకు మేనేజర్' శీర్షికన వైసీపీ అభ్యర్థితో కలిసి అతను చేతిలో మైకు పట్టుకున్న ఫొటోతో వార్త ప్రచురితమైంది. దీనిపై ఎన్నికల అధికారి స్పందిస్తూ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. కాగా టౌన్ బ్యాంకు కోఆపరేటివ్ సొసైటీ పరిధిలో ఉండడం వలన రాజకీయ పార్టీ నేతలతో కలవకూడదన్న నిబంధన ఉన్నట్టు తనకు తెలియదని పాండు వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆయన వివరణపై సంతృప్తి చెందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సస్పెండ్ చేయాల్సిందిగా ఆదేశాలివ్వడంతో ఆ మేరకు అతనిపై వేటు పడింది.

విచ్చలవిడిగా తాయిలాల తరలింపు...?



ఎమ్మెల్యే స్టిక్కర్‌తో నెంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తున్న కారు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 10: శ్రీకాళహస్తిలో ఓటర్లకు అందించేందుకు అధికార పార్టీ నాయకులు విచ్చలవిడిగా తాయిలాలు తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ముఖ్య నేత కుమార్తె ఆర్టీసీ బస్టాండ్‌కు ఆనుకొని అపార్ట్మెంట్లు ఉండే ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఆమె ఇంటి వద్ద నుంచి నెంబర్ ప్లేట్లు తొలగించిన కార్లు నియోజకవర్గం మొత్తం చక్కర్లు కొడుతున్నాయి. రాత్రి వేళల్లో ఆమె ఇంటి నుంచి బయలుదేరుతున్న కార్లు కానుకలతో గ్రామాలకు చేరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. నెంబర్ ప్లేట్ లేని కారుపై ఎమ్మెల్యే అనే స్టిక్కర్ కూడా ఉండడం గమనార్హం.చీరలు, పలు రకాల కానుకలు ఉన్నట్లు సమాచారం.

'రంజాన్ తోఫా' ఏదీ?

జగనన్న పాలనలో ముస్లింలకు అన్నీ మైనసే

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 10 : టీడీపీ హయాంలో ఇస్తున్న రంజాన్ తోఫాకు మరిన్ని సరుకులు కలిపి ఇస్తామని 2019లో రంజాన్ సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో జగన్ చెప్పారు. 2020 నుంచి ఇస్తామన్నారు. ఆ మాటలను నిజమని మైనారిటీలు నమ్మారు. కానీ, ఐదేళ్లయినా రంజాన్ తోఫా ఇవ్వలేదు. మాట నిలబెట్టుకోలేదు. 'మైనార్టీ వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు మిగిలివున్న చర్యలు చేపడతాం. ఆ పార్టీ (టీడీపీ) చేసిందేమి లేదు. మా పార్టీయే (వైసీపీ) ఎంతో చేసింది' అని చెప్పడమే కానీ చేసిందేమీ లేదని ముస్లింలు అంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో బియ్యం కార్డున్న ముస్లిం కుటుంబాలకు చంద్రన్న రంజాన్‌తోఫా కిట్ అందించేవారు. వాటిలో రెండు కిలోల చక్కెర, ఐదు కిలోల గోధుమ పిండి, కిలో సేమియా, వంద గ్రాముల నెయ్యి వంటి సరుకులు ఉండేవి. వీటితో పేద ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకొనే వారు. దీనికి మరిన్ని సరుకులు కలిపి ఇస్తానని అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ మాటే మరిచారు. ముస్లింల ఇంట పండుగంటే గోధుమలు, సేమియాలు, చక్కెర ఉండా ల్సిందే. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసే నిత్యావసరాల్లో గోధుమ పిండి, కందిపప్పును రెండు నెలలుగా నిలిపేసింది. కేవలం అర కిలో చక్కెర మాత్రం అందిస్తోంది. దీంతో పండుగ రోజున ఇంటిల్లిపాదీ చక్కెరతో పాయసం(ఖీర్) చేసుకోవాలన్నా కిలో పైనే చక్కెర అవసరమవుతుంది. రేషన్ దుకాణాల్లో ఇచ్చే అరకిలో చక్కెర సరిపోక మార్కెట్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది.

షాదీఖానా, ఈద్గాల ఊసేలేదు

ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధిని వైసీపీ పూర్తిగా విస్మరించింది.టీడీపీ పాలనలో షాదీఖానాల నిర్మాణం, మసీదులకు మరమ్మతులు, ఈద్గాల అభివృద్ధి, ప్రహరీల నిర్మాణానికి ప్రతీ ఏడాదీ నిధులు మంజూరు చేసేవారు.వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ వీటి జాడే లేదు. పలుమార్లు మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా ప్రతిపాదనలు పంపినా ఒక్క రూపాయి మంజూరు కాలేదని ముస్లిం సోదరులు వాపోతున్నారు. తిరుపతి, సూళ్లూరుపేట, గూడూరుల్లోని షాదీఖానా భవనాల మరమ్మతులకు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నా ఇంత వరకు పట్టించుకున్న వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇచ్చినప్పుడే గౌరవ వేతనాలు

జిల్లాలో సుమారు 450కి పైగా మసీదులున్నాయి. వీటిల్లో 350మందికి పైగా ఇమామ్‌లు(ఆరాధకులు), మౌజన్‌లు(మసీదు సేవకులు) ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో వీరికి గౌరవ వేతనం అందేది.ప్రస్తుతం ఆరు నెలలుగా గౌరవ వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో రంజాన్ పండుగను కూడా సంతోషంగా చేసుకోలేకపోతున్నారు.గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా నెల నెలా గౌరవ వేతనాలు అందేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వారిచ్చినప్పుడు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు మౌజన్లు, ఇమామ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమని అడిగితే ఆ మరుసటి రోజునే దేవుడి సేవ నుంచి తప్పిస్తున్నారంటున్నారు.

దుల్హన్ సాయం ఆగిపోయింది

నిరుపేద ముస్లింలు సైతం వారి ఇంట్లో నిఖా వేడుకను ఉన్నంతలో వైభవంగా జరుపుకుంటారు. నిఖా చేయడం ఆర్థిక భారం కాకూడదనే ఆర్థిక చేయూతను అందించేందుకు గత ప్రభుత్వం దుల్హన్ పథకం కింద నిఖా చేసుకున్న దంపతులకు ఆర్థికసాయం అందించేది. కానీ ప్రస్తుతం దుల్హన్ పథకం అందని ద్రాక్షలా మారింది. దీంతో ఈ పథకం అండగా ఉందనే ధీమాతో అప్పులు చేసి మరీ వారి బిడ్డలకు నిఖా చేసిన వారికి ఈ పథకం అందక అప్పులకు వడ్డీలు కట్టుకోవాల్సి వస్తోంది. జిల్లాలో దాదాపు ఐదు వందలకు పైగా జంటలు దుల్హన్ పథక సాయం కోసం ఎదురు చూస్తున్నాయి.



బస్టాండు ఆవరణలో పడమర వైపు స్థలంలో వైసీపీ నేతల బినామీలు నిర్మించిన గదులు



బస్టాండు ఆవరణలో దక్షిణం వైపు పంచాయతీ దుకాణ సముదాయంలో ఖాళీగా ఉన్న గదులు

రేణిగుంటలో ఇదీ సంగతి

పంచాయతీ ఆదాయానికి ప్రజాప్రతినిధుల గండి!



పోస్టాఫీసు వీధిలో పంచాయతీ గదులు కొట్టివేయడంతో ఖాళీ జాగాలో పూల దుకాణాలు

రేణిగుంట, ఏప్రిల్ 10 : పంచాయతీకి ఆదాయం సమకూర్చాల్సిన ప్రజాప్రతినిధులే ఆదాయానికి గండి కొడుతున్న వైనం రేణిగుంట పంచాయతీలో కన్పిస్తోంది.మేజర్ పంచాయతీ అయిన రేణిగుంటకు సంవత్సరానికి సరాసరి రూ.3కోట్ల ఆదాయం ఉండగా ఖర్చు మాత్రం రూ.4కోట్ల పైనే వుంది.పంచాయతీకి దాదాపు రూ.50లక్షల పైచిలుకు రుసుములు రావాల్సి వుంది.స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం పడమర వైపు ఏడు పంచాయతీ దుకాణాలను, పంచాయతీ కాలువపై మరో ఏడు దుకాణాలను తొలగించారు. అప్పట్లో ఈ విషయం పంచాయతీలో పెద్ద దుమారం రేపింది.వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ట్రాఫిక్ సమస్య ఉన్న చోటే ఆ పార్టీ నాయకులే ఏడు గదులు నిర్మించారు. ఒక్కో దుకాణాన్ని నెలకు రూ.3,990 ధరకు బినామీల పేరుతో తీసుకుని పెద్దమొత్తంలో అడ్వాన్సులతో పాటు నెలకు రూ.15వేలకు బయటి వ్యక్తులకు బాడుగలకు ఇచ్చారు.గతంలో ఇక్కడున్న పంచాయతీ దుకాణాల్లో ఒక్కో దుకాణం నుంచి వేలంపాటల ద్వారా రూ.15వేల నుంచి రూ.20వేల దాకా పంచాయతీకి ఆదాయం సమకూరేది. అయితే ఈ దుకాణాలు నిర్మించుకుని దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా పంచాయతీకి చెల్లించకపోవడం గమనార్హం.బస్టాండు వద్ద దక్షిణం వైపు నిర్మించిన పంచాయతీ దుకాణాల్లో మొదటిది తప్ప మిగిలిన దుకాణాలు అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో ఖాళీగా పడివున్నాయి.పోస్టాఫీసు వీధిలో పంచాయతీకి చెందిన మూడు దుకాణాల నుంచి ఆదాయం వస్తున్నప్పటికీ కాలం తీరిపోయిన నిర్మాణాలంటూ తొలగించి కొత్త గదులు నిర్మించి అద్దెకివ్వాలని వైసీపీ నేతలు ప్రయత్నం చేయగా తీవ్ర విమర్శలు రావడంతో వెనకడుగు వేశారు. గదులు తొలగించిన ఆ స్థలంలో ఇప్పటికీ గదులు నిర్మించకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడింది.

ఏటీఎంలా మారిన ఎంబుక్..?

పంచాయతీ పరిధిలో ప్రజల అత్యవసరాలకు పనులు చేయించి ఆ బిల్లులను ఎంబుక్‌లో రికార్డు చేశాక ఉన్నతాధికారులు సంతకాలు చేస్తే బిల్లులు డ్రా చేసుకుంటారు. అయితే పొక్లయినర్ గంట పనిచేస్తే రెండురోజులు పని చేసినట్లు, ఒక వీధిలో సున్నం కొడితే పంచాయతీ మొత్తం ముగ్గు పిండి కలిపిన సున్నాన్ని కొట్టినట్లు ఎంబుక్‌లో నమోదు చేసుకుని బిల్లులు కాజేస్తున్నారన్న ఆరోణలున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే పంచాయతీ నిధులు ఇలా దుర్వినియోగం అవుతున్నాయని, ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి విచారణ చేయిస్తే వాస్తవాలు బయటపడతాయని స్థానికులు భావిస్తున్నారు.

కరోనాలోనూ ముక్కు పిండి వసూళ్లు

కరోనా కాలంలోనూ ఏడాది పాటు పంచాయతీలో కూరగాయల మార్కెట్,బస్టాండులో వచ్చి పోయే వాహనాలు, సంత గేటు టెండర్లు దక్కించుకున్న వైసీపీ నేతల బినామీలు ముక్కుపిండి వసూలు చేశారు కానీ కలెక్షన్లు రాలేదని కరోనా సాకు చూపుతూ తీర్మానం చేసి అధికారులకు నివేదిక పంపారని విమర్శలున్నాయి.

అనధికారికంగా పంచాయతీ ఉద్యోగాలు

రేణిగుంట పంచాయతీ పరిధిలో నివసిస్తున్న జనాభా అవసరాలు తీర్చేందుకు 65మంది కార్మికులను నియమించుకునేందుకు కలెక్టర్ అప్రూవల్ వుంది.అయితే వైసీపీ హయాంలో జరిగిన ఎన్నికల తరువాత ఏర్పడిన పంచాయతీ బోర్డు మరో 48మందిని తీసుకుని నెలకు ఒక్కొక్కరికి రూ.11వేల చొప్పున జీతాలు చెల్లిస్తోంది. వైసీపీ నాయకుల సిఫార్సు మేరకు తీసుకున్న వీరిలో పంచాయతీ కార్యాలయం లోపలే పదిమంది పనిచేస్తున్నారని, మరో ఇద్దరు ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్నారని చూపుతున్నారు. ఆఖరుకు పార్టీ కార్యాలయంలో కూడా పనిచేసే ఇద్దరికి కూడా పంచాయతీ ఖాతాలో నుంచే జీతాలు చెల్లిస్తున్నారు. మిగిలిన వ్యక్తులు ఎక్కడ పనిచేస్తున్నారో, వీరి జీతాలు ఎవరు తీసుకుంటున్నారో ఎవరికీ తెలియదు.

ఓటు వేయాలంటే గుర్తింపుకార్డు తప్పనిసరి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగానికి గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఓటర్‌కార్డు (ఎపిక్‌కార్డు) లేనివారు ప్రత్యామ్నాయంగా ఆధార్, జాబ్, పాన్‌కార్డులు, బ్యాంకు, పోస్టాఫీస్ జారీ చేసే ఫొటోతో కూడిన పాస్‌బుక్, ఆరోగ్యబీమా స్మార్ట్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, పెన్షన్ డాక్యుమెంట్ ఇలా 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపిస్తే సరిపోతుందన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సంక్షేమం మాటున దోపిడీ: పాశం



యల్లసిరి సర్పంచు కవితకు టీడీపీ కండువా కప్పుతున్న సునీల్‌కుమార్

చిట్టమూరు, ఏప్రిల్ 10: ఐదేళ్ల వైసీపీ పాలనలో సీఎం జగన్ సంక్షేమం మాటున దోపిడీకి తెరతీశారని గూడూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ ఆరోపించారు. బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో మండలంలోని యల్లసిరి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలోని వ్యవస్థలను నిర్వీర్యం చేయడమేకాక, అన్ని వర్గాలకు అన్యాయం చేశారని విమర్శించారు. సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూర్చుతున్నామని చెప్పి పన్నులు, చార్జీలు పెంచి ప్రజలను దోచుకున్నారని అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలతో అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా యల్లసిరి పంచాయతీ సర్పంచు ఏనుగుల కవిత, మాజీ సర్పంచు పోలిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో 20 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి సునీల్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజగోపాలరెడ్డి, మస్తాన్‌రెడ్డి, జనార్దనరెడ్డి, సునీల్‌రెడ్డి, చెంచురామయ్య ఆచారి, భారతమ్మ, చిన్నారావు, గిరినాయుడు, రాజేష్‌రెడ్డి, రషీద్, మణి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని అంతమొందించాలి

గూడూరు, ఏప్రిల్ 10: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోన్న వైసీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చవటపాళెం ప్రాంతంలో టీడీపీలోకి చేరిన పలువురికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దోచుకోవడమే పనిగా పాలన సాగించిందన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి, అవినీతిని ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని, మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు కల్లబొల్లి మాటలు చెబుతూ కుటిల ప్రయత్నాలు చేస్తోందని దుయ్యబట్టారు. ఉమ్మడి కూటమి అధికారంలోకి వస్తే ఫించన్ రూ.4 వేలకు ఇంటి వద్దకే అందజేసేలా చంద్రబాబు బాధ్యత తీసుకుంటారన్నారు. అలాగే వలంటీర్లకు నెలకు రూ.10 వేలు జీతం పెంచుతారని తెలిపారు. యువతకు ఉద్యోగావకాశాల కల్పన, సంక్షేమం, అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడును సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, కనుమూరు హరిచంద్రారెడ్డి, నాగరాజు, పులిమి శ్రీనివాసులు, చాన్‌బాషా, వాటంబేడు శివకుమార్ పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం



బీసీ సదస్సులో మాట్లాడుతున్న రామచంద్రయ్య నాయుడు

డక్కిలి, ఏప్రిల్ 10: టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామయంద్రయ్యా నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని డి.వడ్డిపల్లి గ్రామంలో జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీలో బీసీ కులాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని చెప్పారు. త్వరలో జరిగే ఎన్నికల్లో బీసీలంతా ఏకమై మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుమార్తె, టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయిప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెంకటగిరి నియోకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. చంద్రబాబు నాయుడు బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దాన్ని నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలను అణగదొక్కేశారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, చెలికం భాస్కర రెడ్డి, చితంమాను పెంచలయ్య, వెంకటపతి, దేవళ్ల శంకరయ్య, చెంచురామయ్య, కోటయ్య, పోట్టా మునెయ్య, చినపాపయ్య, వీపీ చౌదరి, అంకయ్య, పోకూరు రమేష్ నాయుడు, బాలకృష్టా రెడ్డి, పాయశం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై దర్యాప్తు వేగవంతం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 10: పదో తరగతి విద్యార్థి అనుమానాస్పద మృతిపై పోలీసుల దర్యాప్తు వేగవంతమైంది. విన్నమాల దళితవాడకు చెందిన వెంకటయ్య, సుభాషిణి దంపతుల కుమారుడు భావేష్(14) మృతదేహం ఈనెల 6వ తేదీన డీఎస్పీ కార్యాలయానికి సమీపంలో రాళ్లగుట్ట నడుమ లభ్యమైన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు విభిన్న కోణాలలో దర్యాప్తు చేస్తున్నారు. భావేష్ నత తల్లిదండ్రుల ఫోన్లను ఉపయోగించి ఉండటం వల్ల వాటి డేటాను పోలీసులు సేకరించి నిశిత పరిశీలన చేస్తున్నారు. భావేష్ మృతదేహం లభ్యమైన ప్రదేశంలో ఎలాంటి రక్తపు మరకలు లేకపోగా, మృతుడి తల, ముఖంపై రక్తపు ధారలు ఉండటంతో ఎక్కడైనా హత్య చేసి తీసుకొచ్చి పడేసుంటారని పోలీసులు భావిస్తున్నారు. కాగా, పట్టణంలోని పార్కు వద్ద స్నేహితులతో చిన్నపాటి వివాదం చోటుచేసుకున్న విషయం పోలీసుల దర్యాప్తుతో వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆ దిశగా కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి



బాలాయపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

బాలాయపల్లి, ఏప్రిల్ 10: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ, ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌ను గెలిపించాలని క్లస్టర్ ఇన్‌చార్జి రాయి సత్యం నాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి కోరారు. బుధవారం బాలాయపల్లి, సంగవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే కార్యక్రమాలను వివరించారు. వైసీపీ నాయకుల మాయమాటలకు మోసపోకుండా వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లూరు ప్రసాద్ నాయుడు, ప్రసన్న కుమార్, కాగితాల తేజ, దట్టం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

కోట, ఏప్రిల్ 10: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఎస్‌ఐ నాగబాబు కోరారు. మండల పరిధిలోని వంజివాక దళితవాడలో బుధవారం రాత్రి ఎన్నికల నిర్వహణపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి కార్యకలాపాలకు ఉండకూడదన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

తడ, ఏప్రిల్ 10: లారీ ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. మండల పరిధిలోని పూడి గ్రామానికి చెందిన వరదపురెడ్డి సెల్వరాజ్(60) బుధవారం సొంత పనిమీద తడలోని జాతీయ రహదారి వద్దకు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ ఇతనిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సెల్వరాజ్‌ను స్థానికులు శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 10: చికిత్స పొందుతూ పురుషోత్తం(68) మృతి చెందినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మార్చి 19వ తేదీన బైపాస్‌రోడ్డులోని ఆవాని అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డు పక్కన పురుషోత్తం నడచి వెళ్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నెల్లూరు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

వాకాడు, ఏప్రిల్ 10: వాకాడు బజారువీధిలో మంగళవారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీ చేశారు. బజారువీధిలో ఉన్న మెడికల్ షాపు, పక్కనే ఉన్న ప్రొవిజన్ షాపు షట్టర్లను పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. మెడికల్ షాపులో సుమారు రూ.10వేలకు పైగా నగదు ఎత్తుకెళ్లారు. ప్రొవిజన్ షాపులో షట్టర్లు పగలగొట్టినప్పటికీ అవి తెరచుకోకపోవడంతో దొంగలు వెనుదిరిగారు.

వలంటీర్ల రాజీనామా

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 10: మున్సిపాలిటీ పరిధిలో 72 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు కమిషనర్ రషీద్ తెలిపారు. అదేవిధంగా మండలంలోని పాపమాంబపురం పంచాయతీ పరిధిలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీవో నీలకంఠారెడ్డి బుధవారం తెలిపారు.





మంగళంపాడు చెరువులో అసంపూర్తి పనులు - వృథాగా ఉన్న నీటి పైపులు

ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి

ఆగిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణ పనులు ● నీటి వనరులున్నా సూళ్లూరుపేటవాసులకు తప్పని ఇబ్బందులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 10: నియోజకవర్గ కేంద్రమైన సూళ్లూరుపేట పట్టణంలో తాగునీటి ఎద్దడి ముంచుకొస్తోంది. ఇప్పటికే ప్రజలు చేతిలో బిందె పట్టుకుని ట్యాంకర్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో 25 వార్డులు, 58 వేల మంది జనాభా ఉన్నారు. ప్రస్తుతం పట్టణానికి పిండిపాలెం వద్దనున్న సమ్మర్ స్టోరేజ్ నుంచి నీటిని అందిస్తున్నారు. అదేవిధంగా తల్లంపాడు చెరువు నుంచి డైరెక్టు పంపింగ్ ద్వారా కొన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఏటా వేసవిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు అడుగంటి నీటి ఎద్దడి నెలకొంటుంది. ఈ నేపథ్యంలో గత టీడీపీలో హయాంలో శాశ్వత నీటి పరిష్కారం కోసం ఏఐఐబీ ఆర్థిక సాయంతో రూ.162 కోట్లతో మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ నిర్మాణం చేపట్టి, అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పట్టణంలో ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా తాగు నీరందించేలా ప్రణాళిక రూపొందించారు. రెండేళ్ల క్రితం మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆ ట్యాంకుకు తెలుగు గంగ నీటిని రప్పించి అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా పట్టణ దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టారు. కొంతదూరం పైపు లైన్ల పనులు కూడా జరిగాయి. ఇంతలో ఎన్నికలు జరిగి అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయి. దీంతో రూ.162 కోట్ల ఏఐఐబీ నీటి పథకం పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. అక్కడక్కడ నిర్మించిన ట్యాంకులు, సంపులు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. నీటి వనరులు పుష్కలంగా ఉన్న సూళ్లూరుపేటలో కూడా నీటి ఎద్దడి ఉందంటే పాలకుల నిర్లక్ష్యమేనని చెప్పాలి. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ముందుముందు మరింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.



ట్యాంకర్ల వద్ద నీళ్లు పట్టుకుంటున్న జనం

జగన్‌ను ఇంటికి పంపడమే కూటమి లక్ష్యం: కురుగొండ్ల



టీడీపీలో చేరిన వారితో కురుగొండ్ల రామకృష్ణ, లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, ఏప్రిల్ 10: రాష్ట్ర ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న జగన్‌ను ఇంటికి సాగనంపడమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గూడూరు వెంకటేశ్వర్లుతో కలిసి మీడియాతో మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బీరం రాజేశ్వరావు, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, గల్లా శ్రీనివాసులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణ పరిధిలోని 4వ వార్డు సాలికాలనీలో తన కుమార్తె, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వార్డు ఇన్‌చార్జి జింకా బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన దొంతు మునివెంకటరత్నం, కుమార్, బి.మునిరాజా, ఎం.నవీన్, పి గోపాల్ ఆచారి, కే.వెంకటేష్, షేక్ జుబేదా, మీనీ, సుజాత, పావని, లడ్డు, సునీత, సుబ్బమ్మ, చెంగమ్మ, బుజ్జమ్మ, జయమ్మ, రాజమ్మ, మునిసా, బత్తినయ్య, నారాయణ, పోలయ్య, చెంగల్‌రాయుడు, సుబ్రహ్మణ్యం, గడ్డం రమేష్, సుబ్బయ్య, ఆనంద్, వంశీలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి: నెలవల



బీసీ సదస్సులో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 10: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మేనకూరులో బుధవారంజయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర బీసీ సదస్సు నిర్వహించి బీసీ డిక్లరేషన్‌ను చేయడం జరిగిందన్నారు. బీసీల అభ్యున్నతి కోసం 50 సంవత్సరాలకే పింఛన్ సదుపాయం, రూ.5 లక్షల నుంచి నూ.10 లక్షల వరకు చంద్రన్నబీమా పెంపు వంటి పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. బీసీలందరూ టీడీపీని గెలిపించాలని నెలవల కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వేనాటి సతీష్‌రెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, చెన్నకేశవులు, జువ్వలపాటి మస్తాన్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం: బీజేపీ



గంగన్నపాళెం గ్రామంలో పర్యటిస్తున్న నాయకులు

వాకాడు, ఏప్రిల్ 10: ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు పాశం సునీల్‌కుమార్, వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించాలని కోరుతూ గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గంగన్నపాళెం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. కార్యక్రమంలో దువ్వూరు మధుసూదనరెడ్డి, బత్తిన ప్రమీల, కుంభాల రఘు, పేట శ్రీహరి, అయోధ్య బాలచంద్రశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, ఏప్రిల్ 10: స్థానిక అడివయ్య కాలనీలోని గాడ్‌గ్రేస్ అనాథ శరణాలయంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని షంషుద్దీన్ ఖాన్ దాతృత్వంతో వృద్ధులకు అన్నదానం చేశారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



పునబాకలో మాట్లాడుతున్న పరసా రత్నం

పెళ్లకూరు, ఏప్రిల్ 10: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని మాజీమంత్రి పరసా రత్నం, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పునబాక పంచాయతీ పరిధిలోని చవటకండ్రిగ, పునబాక, పునబాక కండ్రిగ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరసా రత్నం మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలలో మహిళకు పెద్దపీట వేసి మరోసారి మహిళా పక్షపాతిగా రుజువు చేసుకున్నారని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్లకు నెలకు రూ.10వేలు ఇచ్చి ఆదుకుంటామని తెలిపారు. గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వేలూరు హరినాయుడు, మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షుడు పునబాక పోలయ్య, నాయకులు తాళ్ల యుగంధర్, యాగాని బెన్నీ ఆధ్వర్యంలో సాగిన ప్రచారంలో ప్రజలు పాల్గొని టీడీపీకి మద్దతు పలికారు. ప్రచారానికి వెళ్లిన టీడీపీ నాయకులను ప్రజలు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యాక్రమంలో సూళ్లూరుపేట జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, కందమూడి శివకుమార్, గూడూరు ప్రభావతమ్మ, నాయకులు పేరం మధునాయుడు, శ్రీపతి బాబు, సతీష్‌చంద్ర, వట్టికుండల శేఖర్‌నాయుడు, సుధీర్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

వాకాడు, ఏప్రిల్ 10: వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వాకాడు మండలంలోని టెంకాయతోపు వద్ద జరిగింది. ఎస్‌ఐ పవన్‌కుమార్ కథనం మేరకు... బట్టా బంగారమ్మ(70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. బుధవారం ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగడంతో కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంగమ్మ గ్రామోత్సవం

గూడూరు అర్బన్ 10: ఉగాది సందర్భంగా గంగమ్మ గ్రామోత్సవాన్ని వేడుకగా జరిపారు. స్థానిక గంగమ్మ ఆలయం నుంచి అమ్మవారిని ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా ఆలంకరించి మంగళవాద్యాలు, తప్పెట్లు, తాళాలు, యువత నృత్యాల నడుమ మంగళవారం రాత్రి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం వరకు గ్రామోత్సవం కొనసాగింది. గొల్లలు గంగపెట్టెను ఊరేగిస్తూ వీరతాళ్లతో నృత్యాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బీఎల్‌వోల సమావేశం

తడ, ఏప్రిల్ 10: మండలంలోని బీఎల్‌వోలతో తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ బుధవారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు, పోలింగ్ సిబ్బందికి బస్సుల ఏర్పాటు, సమస్యాత్మక కేంద్రాలపై ఆయన బీఎల్‌వోలకు తగు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు శరత్‌బాబు, ఎంఈవో మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరిలో జరిగిన ఆత్మీయ సమావేశంలో వరప్రసాద్, లక్ష్మీసాయిప్రియ, నాయకులు

పెత్తందారుల అరాచకాలను తిప్పికొడదాం: వరప్రసాద్

వరదయ్యపాళెం/తడ/వెంకటగిరి, ఏప్రిల్ 10: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రంలో పెత్తందారుల అరాచకాలను తిప్పికొడదామని ఆ పార్టీల తిరుపతి పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి, గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. వరదయ్యపాళెంలో బుధవారం జరిగిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీలోని పెత్తందారుల అడుగులకు తాము మడుగులు ఒత్తలేదన్న కారణంగా కక్ష కట్టి పార్టీ నుంచీ తనను, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని బయటికి పంపించేశారని ఆరోపించారు.



తడలో టీడీపీ నేతలతో వరప్రసాద్

తడలో టీడీపీ నేతలతో వరప్రసాద్ భేటీ

ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ బుధవారం తడలో మండలానికి చెందిన టీడీపీ నేతలను కలుసుకున్నారు. ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఆయనకు శాలువాలు కప్పి సత్కరించారు.

వెంకటగిరిలో ఆత్మీయ సమావేశం

వెంకటగిరిలో నియోజకవర్గ స్థాయి బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నుంచీ గెలవడం ద్వారా కేంద్ర సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి బంగారు బాటలు వేసేందుకు అవకాశం వుంటుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రధాని కావడం కోసం తిరుపతి నుంచీ బీజేపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని, దానికోసం శ్రేణులు కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా సుధాకర్



సుధాకర్‌కు నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాసులురెడ్డి

గూడూరు అర్బన్, ఏప్రిల్ 10: మండలంలోని అయ్యవారిపాళెం గ్రామానికి చెందిన సుధాకర్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సుధాకర్‌కు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిల్లకూరు వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 10: ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ప్రేమ్‌రాజ్, మున్సిపల్ కమిషనర్ జనార్దరెడ్డి అన్నారు. బధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పార్టీ సమావేశాలకు, బైక్ ర్యాలీలు, రోడ్డు షోలు వంటి కార్యక్రమాలకు రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు పొందాలని స్పష్టం చేశారు.

ఏరియా ఆస్పత్రికి గీజర్ల వితరణ



గీజర్లు అందజేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు, ఏప్రిల్ 10: స్థానిక ఏరియా ఆస్పత్రికి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శివకుమార్‌రెడ్డి దాతృత్వంతో రెండు గీజర్లు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజా, రోటరీక్లబ్ ప్రతినిధులు రామకృష్ణస్వరూప్, మునిగిరీష్, దశరథరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, రవికుమార్, పీవీ కృష్ణయ్య, సిబ్బంది మౌలాలి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

కోటలో బీసీ సదస్సు

కోట, ఏప్రిల్ 10: మండల పరిధిలోని కేశవరంలో బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమరెడ్డి అధ్యక్షతన బీసీ జయహో సదస్సు జరిగింది. టీడీపీని గెలిపించుకుందాం... అభివృద్ధికి బాటలు వేసుకుందాం... అంటూ నినాదాలు చేశారు. పాశం సునీల్‌కుమార్‌ను గెలిపించుకొని గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధిని మెరుగుపరుచుకుందామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చాపల శ్రీనివాసులు, కందల బాలకృష్ణయాదవ్, కృష్ణయ్య, చంద్రశేఖర్, చిట్టేటి నాగూరయ్య, శీనయ్య, భూపతి, సుబ్రహ్మణ్యం, గోపా లయ్య, సురేష్, నాగేంద్ర, శివ, సుబ్బారావు, దామోదర్ పాల్గొన్నారు.



బీసీ సదస్సులో టీడీపీ నాయకులు